PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 278 | విజయవాడ, సోమవారం 12 మే 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 12 May 2025 | Rs

## యుద్ధం వద్దంటే దేశద్రోహులా?

- దేశానికి మంచి-చెడులు చెప్పగలిగేది కమ్యూనిస్టులే...
- యుద్ధానికి సై అన్నవాళ్లు ఇప్పుడు వద్దని ఒడంబడిక
- సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభలో బివి రాఘవులు

2

## అదరగొట్టిన అమ్మాయిలు

6

- మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ భారత్ కైవసం

అత్యున్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# ఇంకా ఉంది..!

## 'ఆపరేషన్ సిందూర్'పై ప్రధాని మోడీ ?

## 'ట్రంప్' వ్యాఖ్యలపై నష్టనివారణ చర్యలు చేపట్టిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతుండటంతో కేంద్రప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. దీనిలోభాగంగా ఆదివారం నిర్వహించిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలు కీలక వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వ వర్గాలు మీడియాకు తెలిపాయి. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసి పోలేదు. పాక్ దాడికి దిగితే, భారత్ ఎదురు దాడి చేస్తుంది.' అని ఆయన అన్నారని ఆ వర్గాలు మీడియాకు చెప్పాయి. కాల్పుల విరమణ విషయాన్ని భారత్, పాక్‌ల కన్నా ముందు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'మధ్యవర్తిత్వం చేశాం. ఒక రాత్రంతా సుదీర్ఘ చర్చలు జరిపాం' అంటూ ఆయన చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తుతుండగానే ఆదివారం ఆయన మరో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా పోస్టులో ఆయన కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని పేర్కొనడం మరింత వివాదాస్పదంగా మారింది. ద్వైపాక్షిక అంశంలో అమెరికా జోక్యం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపధ్యంలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోడీ ఆపరేషన్ సిందూర్‌తో పాటు పిఓకే అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వ వర్గాలు మీడియాకు తెలిపాయి. ఆ వర్గాలు చెప్పిన సమాచారం ప్రకారం 'అటు నుండి తుపాకి గుళ్లు వస్తే.. ఇటు నుండి మిసైల్స్ ప్రయోగించాలి (వహన్ సే గోలి చలేగి... తో యహన్ సే గోళా చలేగా) అని మోడీ చెప్పారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ అంశాన్ని కూడా ప్రస్తావించిన ఆయన 'పిఒకె అంశంపై మధ్యవర్తులు అవసరం లేదు' అని అన్నారు. 'ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా పాకిస్తాన్‌కు మరో మార్గం లేదు. కాశ్మీర్ అంశంలో భారత్ వైఖరి ఎప్పుడూ మారలేదు. ఈ అంశంపై ఇంతకుమించి మాట్లాడేదేమి లేదు' అని ప్రధాని ఈ సమావేశంలో అన్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగానే త్రివిధ దళాల అధినేతలకు 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసిపోలేదని, అప్రమత్తంగా ఉండాలి' అని ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి కొత్త సందేశం ఇచ్చామని, ఉగ్రశిబిరాలనే కాకుండా వాటి హెడ్ క్వార్టర్స్‌ను కూడా ధ్వంసం చేశామని మోడీ చెప్పారని ప్రభుత్వ వర్గాలు మీడియాకు తెలిపాయి. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జయశంకర్‌తోపాటు మిగతా 2లో

# పశుగ్రాసం ఏదీ?

## 13.4 లక్షల మెట్రిక్ టన్నుల పచ్చిగ్రాసం కొరత • పలు జిల్లాల్లో ఎండుగడ్డికి కటకట

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడింది. ఏటా వేసవి సీజన్‌లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉన్నా అధికారులు సకాలంలో స్పందించలేదు. పశుసంవర్ధక శాఖ ముందస్తు చర్యలతో ఈ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 14.80 కోట్ల పశువులు ఉన్నాయి. వీటికి ఈ సీజన్ ఏప్రిల్ నుంచి జూన్ వరకూ 13.4 లక్షల మెట్రిక్ టన్నుల పచ్చగడ్డి (పచ్చిగ్రాసం) కొరత నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా పశువులకు పచ్చగడ్డి 169 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం ఉండగా, 155.6 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. దీనివల్ల పచ్చగడ్డి కొరతతో పశువులు అర్థాకలితో అలమటిస్తున్నాయి. ఎండుగడ్డి పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 71.51 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, 82.61 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. సహజంగా పశువుల్లో స్థానిక గేదెకు రోజుకు 15.25 కిలోలు, స్థానిక ఆవుకు 12.73 కిలోల గ్రాసం అవసరం ఉందని, ఇందులో 50 శాతం గ్రాసం పచ్చిమేత రూపంలో ఇవ్వాల్సి ఉంటుందని పశువైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

**పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం**

పచ్చిమేత కొరత వల్ల పాలదిగుబడి తగ్గిపోయి పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 164 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తిని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పశుగ్రాసం కొరత కారణంగా ఆ లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. వేసవిలో పశుగ్రాసం కొరత, వాతావరణ పరిస్థితుల కారణంగా పశువుల పాలదిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. ఎండు గడ్డి, పచ్చగడ్డి సమపరిమాణంలో అందించడంతోపాటు వాతావరణ పరిస్థితుల నుంచి రక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి. అప్పుడే పశువులలో పాల ఉత్పత్తి మెరుగై అధిక పాలదిగుబడికి అవకాశం ఉంటుంది. అత్యధికంగా మిగతా 2లో

**జిల్లాల్లో పశుగ్రాసం కొరత వివరాలు (లక్షల మెట్రిక్ టన్నుల్లో)**

| జిల్లా | పచ్చగడ్డి అవసరం | పచ్చగడ్డి లభ్యత | ఎండుగడ్డి అవసరం | ఎండుగడ్డి లభ్యత |
|---|---|---|---|---|
| అల్లూరి సీతారామరాజు | 15.34 | 5.60 | 3.08 | 1.8 |
| అన్నమయ్య | 7.44 | 5.01 | 3.72 | 2.72 |
| గుంటూరు | 3.29 | 1.80 | 1.97 | 0.80 |
| పల్నాడు | 11.25 | 10.29 | 2.81 | 2.75 |
| తిరుపతి | 18.90 | 17.95 | 3.15 | 19.95 |
| ప్రకాశం | 3.71 | 3.26 | 1.92 | 1.42 |
| నెల్లూరు | 8.34 | 8.11 | 4.17 | 3.98 |
| బాపట్ల | 0.94 | 0.34 | 0.47 | 1.20 |
| పశ్చిమగోదావరి | 2.66 | 2.23 | 1.33 | 1.98 |
| అనకాపల్లి | 4.05 | 4.08 | 6.6 | 1.6 |
| విజయనగరం | 3.75 | 3.82 | 6.12 | 5.98 |
| వైఎస్ఆర్ కడప | 7.85 | 8.96 | 3.16 | 2.64 |

## నేడు డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు

- సమస్యలు పరిష్కరించకుంటే విద్యాభవన్ ముట్టడి
- యుటిఎఫ్ పిలుపు

3

## వ్యవసాయంలో మహిళా కార్మికులదే కీలక పాత్ర

- మనువాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం
- వ్యవసాయ, గ్రామీణ మహిళా కార్మికుల జాతీయ కన్వెన్షన్ ముగింపు సభలో నేతలు

5

## 2030 నాటికీ అనుమానమే?

- విశాఖ మెట్రో మరింత జాప్యం
- డిపిఆర్ ఆమోదంపై కేంద్రం మీనమేషాలు
- ఏపి మెట్రో ప్రీ-బిడ్డింగ్ సమావేశంలో కన్సల్టెంట్ నియామకంపై చర్చ

3

# బేసిక్ బడులే అధికం

- రాష్ట్రంలో 20 వేలు ఏర్పాటు
- విద్యాశాఖ నిర్ణయం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో బేసిక్ బడులే ఎక్కువగా ఉండనున్నాయి. సంస్కరణల్లో భాగంగా పాఠశాలలను పలు రకాలుగా రాష్ట్రప్రభుత్వం విభజిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన కసరత్తును పాఠశాల విద్యాశాఖ పూర్తి చేస్తోంది. దీంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మారనుంది. ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ పేర్లతో బడులు రానున్నాయి. రాష్ట్రంలో 20 వేల బేసిక్ ప్రైమరీ పాఠశాలల (బిపిఎస్)ను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ (ఎంపిఎస్) విధానాన్ని విద్యాశాఖ తీసుకొస్తున్న విషయం తెలిసిందే. ఒక ఊరిలో ఉన్న అని ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు తరలించాలని ముందుగా పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేసింది. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొంతమేర వెనక్కి తగ్గింది. 3, 4, 5 తరగతులను ప్రైమరీకి పంపించలేని చోట ఈ బేసిక్ పాఠశాలలను ఉంచాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అంటే ఉన్న పాఠశాలల్లో దాదాపు సగభాగం బేసిక్ పాఠశాలలుగా మారనున్నాయి. అదేవిధంగా సుమారు 9,500 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. మోడల్ పాఠశాలల్లో తరగతి గదికి ఒక టీచర్ ఉంటే బేసిక్ బడుల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థుల సంఖ్య 20 ఉంటే ఒక టీచర్ ఉంటారు. సంఖ్య 60లోపు ఉంటే అదనంగా మరో టీచర్‌ను విద్యాశాఖ కేటాయించనుంది. ఈ విధానంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులుండే ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధన కష్టతరంగా మారడమే కాకుండా విద్యార్థులకు కూడా నష్టం కలిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య 60 కాకుండా 40 దాటితే మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు ఉంటే మోడల్ స్కూళ్లతోపాటు ఈ స్కూళ్లు అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.

## నేడు 70 మండలాల్లో వడగాడ్పులు

- విపత్తుల నిర్వహణ సంస్థ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 70 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 29 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 41 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. తీవ్ర గాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళంలో 6, విజయనగరంలో 9, పార్వతీపురం మన్యం 19, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాలు ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళం 7, విజయనగరం 14, పార్వతీపురం మన్యం 4, అల్లూరి సీతారామరాజు 4, అనకాపల్లి 4, కాకినాడ 4, తూర్పుగోదావరి 1, కృష్ణాలో 3 మండలాలు ఉన్నాయి. ఆదివారం ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల, శ్రీకాకుళం జిల్లా జగ్గిలి బొంతులో 42.2 డిగ్రీల చొప్పున, తిరుపతి జిల్లా ఓజిలి, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 41.8 డిగ్రీల చొప్పున, ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, చిత్తూరు జిల్లా పిపల్లిలో 41.6 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తమ్మీద ఆదివారం 144 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌లో 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డు సేవలు

- ఇకెవైసిలో రాష్ట్రం టాప్
- కళాకారులకు 'అంత్యోదయ' ద్వారా బియ్యం : మంత్రి నాదెండ్ల

**ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)**

తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సప్ గవర్నెన్స్ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డు సేవలు ఈ నెల 15 నుంచి 9552300009 నంబర్లో అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, మార్పులు చేర్పులకు సంబంధించి ఆరు సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,46,21,000 రేషన్ కార్డుల ద్వారా 4,24,60,000 మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇకెవైసిలో ఐదేళ్లలోపు చిన్నారులు, 80 ఏళ్లపైబడిన వారికి మినహాయింపు ఉందని, ఆ సంఖ్య 6.32 లక్షలని వివరించారు. రేషన్ కార్డులను స్మార్ట్ కార్డు రూపంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దానికి దరఖాస్తు విధానం గ్రామ వార్డు సచివాలయాలలో ఈ నెల 8 నుంచి అందుబాటులోకి వచ్చిందని, ఇప్పటికే 72,514 మంది స్మార్ట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్మార్ట్ కార్డు దరఖాస్తుతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు మార్పు చేర్పులకు అవకాశం కల్పించామని, కొద్ది రోజుల్లోనే 51,770 మంది కుటుంబ సభ్యులను కొత్తగా చేర్చామని చెప్పారు. 10,747 మంది కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు ట్రాన్స్‌జెండర్లకూ కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నామని చెప్పారు. ఒంటరి మహిళలు, 50 ఏళ్ల పైబడి అవివాహితులుగా సింగిల్‌గా ఉన్నవారికి, ఆశ్రమాల్లో దీర్ఘకాలికంగా అనాథలుగా ఉన్న వారికి కార్డులు కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. కళాకారుల పింఛను పొందుతున్న వారికి అంత్యోదయ అన్న యోజన పథకం కింద ప్రతి నెలా 35 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గుర్తించిన 12 సామాజిక తరగతుల వారికి కూడా నిబంధనల మేరకు అంత్యోదయ అన్న యోజన పథకం వర్తింపజేయనున్నామని మంత్రి చెప్పారు.

## తెలంగాణ ఎప్‌సెట్ ఇంజనీరింగ్‌లో ఆంధ్రా విద్యార్థులకు 1, 3 ర్యాంకులు

- ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో నిరాశేనా?

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, కొమరాడ (పార్వతీపురం మన్యం జిల్లా), విజయనగరం టౌన్**

తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) ఫలితాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆదివారం విడుదల చేశారు. ఎప్‌సెట్ ఇంజనీరింగ్ ఫలితాల్లో మన రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుణానపురం గ్రామానికి చెందిన పల్లా భరత్‌చంద్ర మొదటి ర్యాంకు, విజయనగరానికి చెందిన పమ్మిన హేమ సాయి సూర్య కార్తీక్ మూడో ర్యాంకు సాధించారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా లేనందున ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు తెలంగాణలో సీట్లు కేటాయించాల్సిన అవసరం లేదని, అందువల్ల వారు తెలంగాణలో ప్రవేశాలకు అర్హులు కారని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకృష్ణారెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో తెలంగాణలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన సాకేత్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంజనీరింగ్ టాప్‌టెన్‌లో అందరూ అబ్బాయిలే కాగా, అగ్రికల్చర్ పార్మసీ విభాగంలో టాప్ టెన్‌లో ఒక అమ్మాయికే ర్యాంక్ వచ్చింది. ఇంజనీరింగ్‌లో మొదటి ర్యాంకు సాధించిన పల్లా భరత్‌చంద్ర తండ్రి రామకృష్ణ హెడ్‌కానిస్టేబుల్‌గా, తల్లి దమయంతి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. భరత్‌చంద్ర హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. ఇటీవల జెఇఇ మెయిన్స్‌లో 99.6 పాయింట్లు సాధించాడు. మూడో ర్యాంకు సాధించిన పమ్మిన హేమ సాయి సూర్య కార్తీక్ ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుకున్నారు. ముంబయి ఐఐటిలో కంప్యూటర్ ఇంజనీర్‌గా చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపాడు. ఆయన తండ్రి రామ్మోహన్‌నాయుడు చైతన్య కళాశాలలో లెక్చరర్‌గా, తల్లి దీపిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

భరత్‌చంద్ర



హేమ సాయి సూర్య కార్తీక్

# అగ్నివీరుడికి కన్నీటి వీడ్కోలు

- సైనికలాంఛనాలతో మురళీనాయక్ అంత్యక్రియలు పూర్తి
- పవన్ కల్యాణ్ సహా పలువురు ప్రముఖులు హాజరు

మురళీనాయక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పవన్ కల్యాణ్, లోకేష్, అనిత, సవిత తదితరులు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

భారత్‌కు పాకిస్తాన్‌తో జరిగిన పోరాటంలో అమరుడైన వీర సైనికుడు మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం అశ్రునాయనాల నడుమ పూర్తయ్యాయి. మురళీ నాయక్ భౌతికకాయానికి ఆయన స్వగ్రామమైన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వీర జవాన్‌ను కడసారి చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మురళీనాయక్ వ్యవసాయ క్షేత్రం మిగతా 2లో

## సిపిఎం నివాళి

- మురళీనాయక్ కుటుంబాన్ని రెగ్యులర్ సైనికుల మాదిరే ఆదుకోవాలి : వి.శ్రీనివాసరావు డిమాండ్
- నారాయణపై సోము వీర్రాజు వ్యాఖ్యలకు ఖండన

**ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో**

ఉగ్రవాదంపై పోరులో అసువులు బాసిన మురళీనాయక్ సహా అమరులైన సైనికులకు పౌరులకు సిపిఎం రాష్ట్రకమిటీ శ్రద్ధాంజలి ఘటించింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశానంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావును ప్రజాశక్తి ప్రతినిధితో మాట్లాడుతూ మురళీనాయక్ కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. యుద్ధరంగంలో మరణించిన రెగ్యులర్ సైనికుల కుటుంబాల తరహాలోనే మురళీ నాయక్ కుటుంబాన్ని కూడా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షన్‌తో పాటు ఇతర అన్ని సహాయాలను అందించాలని కోరారు. ఉగ్రవాదంపై యుద్ధానికి మతం రంగు పులమడం ప్రమాదకరమని, దేశ ఐక్యతకు అది విఘాతమని ఆయన చెప్పారు. అదే సమయంలో దీన్ని రెండు దేశాల మధ్య యుద్ధంగా మార్చడం కూడా సరైనది కాదని అన్నారు. ఉగ్రవాదంపై పోరును దేశ ప్రజలందరినీ ఐక్యపరిచి, పాకిస్తాన్‌ను ఒంటరిపాటు చేసి జరపాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య యుద్ధ విరమణ ఒప్పందాన్ని తమ పార్టీ స్వాగతించిందని చెప్పారు.

**సోమువీర్రాజుది బాధ్యతా రాహిత్యం**

సిపిఐ అఖిల భారత నాయకులు కె నారాయణపై బిజెపి ఎంఎల్‌సి సోము వీర్రాజు బాధ్యతారహిత్యంగా నోరు పారేసుకోవడం సముచితం కాదని శ్రీనివాసరావు అన్నారు. యుద్ధం వద్దన్నందుకే నారాయణను పాకిస్తాన్ పొమ్మన్న బిజెపి నాయకులు, ఇప్పుడు ప్రభుత్వమే కాల్పుల విరమణ చేసినందుకు మిగతా 2లో

# యుద్ధం వద్దంటే దేశద్రోహులా?

- దేశానికి మంచి-చెడులు చెప్పగలిగేది కమ్యూనిస్టులే... ● యుద్ధానికి సై అన్నవాళ్లు ఇప్పుడు వద్దని ఒడంబడిక
- సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభలో బివి రాఘవులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

యుద్ధం వద్దన్నందుకు కమ్యూనిస్టులను కొందరు దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు యత్నించారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. చివరకు యుద్ధానికి పురిగొల్పిన వాళ్లే వద్దని ఒడంబడిక చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. దేశానికి ఏది మంచో, ఏది చెడో చెప్పగలిగేది కమ్యూనిస్టులేనని అన్నారు. పార్టీ విచ్ఛిన్నమైన ప్రాంతంలో ఏటికి ఎదురొడ్డి పోరాడిన సంక్రాంతి మధుసూదన్‌రావు స్ఫూర్తితో భవిష్యత్తుపై నమ్మకంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురంలో ఆదివారం జరిగిన సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభకు బివి రాఘవులు హాజరయ్యారు. ముందుగా మధుసూదన్‌రావు స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అధ్యక్షతన జరిగిన సభలో బివి రాఘవులు మాట్లాడారు. ఏప్రిల్ 22 నుంచి పాకిస్తాన్-ఇండియా మధ్య యుద్ధవాతావరణం చూస్తున్నామన్నారు. పహల్గాంలో పర్యాటకులపై దాడి జరిగినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. పాకిస్తాన్‌కు చెందిన తొమ్మిది ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. కారణాలు ఏవైనా కాల్పుల విరమణకు ఇరుదేశాలు ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. 26 మంది పర్యాటకుల ప్రాణాలను బలిదీసుకున్న పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలని, అదే పరిష్కారమని అనేక మంది రెచ్చగొట్టారన్నారు. కానీ,

సంస్మరణ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

కమ్యూనిస్టులు, కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు మాత్రమే యుద్ధం వద్దన్నాయని తెలిపారు. ఆయా దేశాల జోక్యంతో శాంతియుతంగా దీన్ని పరిష్కరించుకోవాలన్నందుకు కమ్యూనిస్టులను దేశద్రోహులుగా కొందరు చిత్రీకరించే ప్రయత్నం చేశారన్నారు. చివరకు యుద్ధం పరిష్కారం కాదని వారు ఒడంబడిక చేసుకోవాల్సి వచ్చింద న్నారు. ఎవరైతే యుద్ధం చేయాలని పురిగొల్పారో వారే యుద్ధం పరిష్కారం కాదని ప్రకటించాల్సిన స్థితికి వచ్చారన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం తన నిర్ణయం తాను చేసుకోకుండా అమెరికా మీద ఆధారపడలా అని ప్రశ్నించారు. దేశ ప్రయోజనాలను కాపాడగలిగేది కమ్యూనిస్టులు, లౌకికశక్తులు మాత్రమేనని తెలిపారు.

**ప్రపంచ దేశాలపై అమెరికా సుంకాల దాడి..**

ప్రపంచ దేశాలపై అమెరికా వాణిజ్యపరమైన దాడి చేస్తోందని రాఘవులు అన్నారు. తమ దేశంలోకి వచ్చే వస్తువులపై 140 శాతం దిగుమతి సుంకం విధిస్తామని అమెరికా ప్రకటిస్తోందన్నారు. అమెరికా నుంచి ఇతర దేశాలు దిగుమతి చేసుకునే వస్తువులపై మాత్రం పన్నులు తీసివేయాలని ట్రంప్ ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఎనిమిది నుంచి 14 గంటల పని విధానాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ నెల 20న కార్మికులు సమ్మెకు దిగుతున్నారన్నారు. దీనికి కర్షక సంఘాలు సైతం మద్దతు తెలుపుతున్నాయన్నారు. రాబోయే కాలంలో మరిన్ని కష్టాలు వస్తాయని హెచ్చరించారు. వీటిని ఎదుర్కోవాలంటే పోరాట పటిమ అవసరమని అన్నారు. సంక్రాంతి మధుసూదన్‌రావు వంటి వారి స్ఫూర్తితో ఈ పోరాట పటిమ పుణికిపుచ్చుకోవాలన్నారు. ఇండియా వేదిక ఐక్యతను మరింతగా బలపరుచుకోవాలన్నారు.

**సమస్యలపై మేల్కొలిపేది కమ్యూనిస్టులే : ఎంపీ మల్లు రవి**

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ప్రజలు వారి సమస్యలను వారే పరిష్కరించుకునేలా.. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చెప్పగలిగిన గొప్ప నాయకులు మధుసూదన్‌రావు అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు సమస్యలపై ప్రజలను మేల్కొలిపే కోడికూత లాంటివారని తెలిపారు. సిద్ధాంతపరమైన ఐక్యతతో ముందుకెళ్లామన్నారు.

**మంచి కమ్యూనిస్టు మధుసూదన్‌రావు : తమ్మినేని**

లీ షావ్ చీ చెప్పినట్టు మంచి కమ్యూనిస్టు లక్షణాలను పుణికిపుచ్చుకున్న కామ్రేడ్ సంక్రాంతి మధుసూదన్‌రావు అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టు జీవితం చాలా క్లిష్టమని, డబ్బుపై వ్యామోహం, పదవీ కాంక్ష, ప్రాణాలపై తీపి ఉండకూడదని పేర్కొన్నారు. అంతటి క్లిష్టమైన జీవితాన్ని మధుసూదన్‌రావు ఎంతో ఇష్టంగా కొనసాగించారని తెలిపారు. ఉద్యమమే జీవితం.. జీవితమే ఉద్యమంలా జీవించారన్నారు. సంస్మరణ సభలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ఎం శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, టిజిఒస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు అంతకుముందు లాలాపురంలో ఎర్రజెండాలతో భారీ ప్రదర్శన తీశారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ

- ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా ఆలపాటి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాయపాటి శైలజ

ఆలపాటి సురేష్

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా ఆలపాటి సురేష్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ, ఆప్కాబ్ ఛైర్మన్‌గా ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులును ప్రభుత్వం ఆదివారం నియమించింది. వీరితో పాటు పలు కార్పొరేషన్‌లకు ఛైర్మన్లను, పలు జిల్లాలకు డిసిసిబి ఛైర్మన్లను నియమించింది.

| | |
|---|---|
| ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు | జెడ్ శివప్రసాద్ (నెల్లూరు సిటీ) |
| విద్య, సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ | ఎస్ రాజశేఖర్ (కుప్పం) |
| గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ | సుగుణమ్మ (తిరుపతి) |
| కార్మిక సంక్షేమ బోర్డు | వెంకట శివుడు (గుంతకల్) |
| నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ | బురుగుపల్లి శేషారావు (నిడదవోలు) |
| మహిళల సహకార కార్పొరేషన్ | పీతల సుజాత (భీమవరం) |
| ఏలూరు అర్బన్ అథారిటీ డెవలప్‌మెంట్ | వాణి వెంకట శివప్రసాద్ (పెన్నుబోయిన) |
| ఎన్ఆర్‌డి సొసైటీ | రవి వేమూరు (తెనాలి) |
| ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ | మలేపాటి సుబ్బానాయుడు (కావలి) |
| ఎస్‌సి కమిషన్ | కెఎస్ జవహర్ (కొవ్వూరు) |
| మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య | పెద్దిరాజు కొల్లు (నరసాపురం) |
| కుమ్మరి శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ | పేరేపి ఈశ్వర్ (విజయవాడ ఈస్ట్) |
| వడ్డెర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ | మల్లెల ఈశ్వరరావు (గుంటూరు) |
| టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్య | ఆకాసపు స్వామి (తాడేపల్లిగూడెం) |
| నీటి పారుదల అభివృద్ధి సహకార సంస్థ | లీలాకృష్ణ (మండపేట) |
| లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ | రియాజ్ (ఒంగోలు) |
| హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (తిరుపతి)(జనసేన) | పసుపులేటి హరిప్రసాద్ |
| ఎస్‌టి కమిషన్ | సోల్ల బొజ్జిరెడ్డి (రంపచోడవరం) (బిజెపి) |

## కౌలు రైతుకూ పెట్టుబడి సాయం ఇవ్వండి

- ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్

**ప్రజాశక్తి -నెల్లూరు**

అన్నదాత సుఖీభవ పథకం ప్రతి కౌలు రైతుకూ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరి బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులో ఆయన ఆదివారం విలేకరులతోఖ మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకూ ఇస్తామని టిడిపి కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చినందున దీనిని అమలు చేయాల్సిన బాధ్యత టిడిపి కూటమి ప్రభుత్వం ఉందన్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీ పూర్తయినా ఇప్పటి వరకు ఆ పథకం విధివిధానాలు ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. సొంత భూమి ఉన్న రైతులు మే 20వ తేదీలోగా ఎన్యూమరేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశించారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం రూ. 20 వేలు ఏ విధంగా ఇస్తారో విధివిధానాలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామసభ ఆమోదంతో కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అన్ని పంటలకూ ధర పడిపోయిందని తెలిపారు. నెల్లూరు జిల్లాలో పుట్టి (850 కిలోలు) ధాన్యం రూ.19720 మద్దతు ధర నిర్ణయించిందని, ఈ ఏడాది పుట్టి ధాన్యం రూ.16 వేల నుంచి రూ.17 వేల మధ్యలో రైతులు అమ్ముకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి, మినుము, జీడి, మామిడి తదితర పంటలకు ధరలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి తుల్లూరు గోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు గంట లక్ష్మిపతి, సీనియర్ నాయకులు పి చంద్రమౌళి పాల్గొన్నారు.

## అగ్నివీరుడికి కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

వరకు దారి పొడవునా మురళీ నాయక్ అమర్ రహే... నినాదాలు హోరెత్తాయి. అంత్యక్రియలు జరిగే ప్రాంతంలో సైనికాధికారులు గన్ సెల్యూట్‌తో గౌరవ వందనాన్ని అందించారు. అనంతరం జాతీయ పతకాన్ని మురళీనాయక్ తండ్రికి అందజేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, అనగాని సత్య ప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్ తదితరులు మురళీనాయక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**అండగా ఉంటాం : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ :** మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఐదు ఎకరాల పొలంతోపాటు, 300 గజాల ఇంటి స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా తాను వ్యక్తిగతంగా రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని తెలిపారు.

**భౌతికకాయాన్ని మోసిన నారా లోకేశ్:** వీర మరణం పొందిన మురళీ నాయక్ భౌతికకాయం ఉన్న శవ పేటికను స్వయంగా నారా లోకేశ్ మోశారు. అంతకు ముందు మురళీనాయక్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..మురళీనాయక్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో స్మారక స్థూపం నిర్మిస్తామని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు కల్లితండా పేరును మురళీ నాయక్ తండాగా మారుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని, మురళీనాయక్ తండ్రికి ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు.

## సిపిఎం నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఏమి చెబుతారని ప్రశ్నించారు. యుద్ధం వద్దన్న దేశ ప్రజలు ద్రోహులైతే.. అమెరికా అధ్యక్షుడి ఆజ్ఞలకు తలొగ్గి పాకిస్తాన్‌తో రహస్య ఒడంబడిక చేసుకున్న మోడీ, బిజెపి నాయకులను ఏమనాలని ప్రశ్నించారు. ఇప్పటికీ పహల్గమ్‌లో దాడి చేసిన ఉగ్రవాదులను పట్టుకోలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా బిజెపి నాయకులు నమ్రతతో, బాధ్యతగా, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని కోరారు.

**సిపిఐ ఖండన**

బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'టెర్రరిజాన్ని అంతం చేసేందుకు అందరూ కలిసి పోరాడాలని, ప్రపంచ దేశాలు ఇందులో కీలక పాత్ర పోషించాలని, అనివార్యం అయితే యుద్ధం తప్పనిసరి అని' ప్రజాభిప్రాయాన్ని పార్టీ నేతగా చెప్పిన సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణపై బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుందుడుకు వ్యాఖ్యలు చేశారని ఆయన తెలిపారు. నారాయణను పాకిస్తాన్ పంపించాలంటూ వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ చెబితే కాల్పులు ఆపేశారని, అందువల్ల సోము వీర్రాజు అమెరికాకు వెళ్లి ఉంటారా? ఆయన అని ప్రశ్నించారు. సోము చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ సంఘర్షణలకు మూలకారకమైన సామ్రాజ్యవాద శక్తి అమెరికా అని, ద్వైపాక్షికంగా ఉండాల్సిన సమస్యలో అమెరికా మధ్యవర్తిత్వం వహించడం, అందుకు భారత్, పాకిస్తాన్ ప్రభుత్వాలు అంగీకరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. సిమ్లా ఒప్పందం ప్రకారం భారత్, పాకిస్తాన్ తమ వివాదాలను ఇరు దేశాలు మాత్రమే పరిష్కరించుకోవాలని, ఈ ప్రక్రియలో అమెరికా చొరవకు అంగీకరించడం సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు.

## ఇంకా ఉంది..!

(మొదటి పేజీ తరువాయి)

పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**100 మంది ఉగ్రవాదుల హతం**

ప్రధాని సమావేశానంతరం త్రివిధ దళాల అధికారు(డిజిఎంఒ)లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో వంద మంది ఉగ్రవాదులను హతం చేసినట్లు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన తరువాత డిజిఎంఓలు మీడియా ముందుకు రావడం ఇదే మొదటిసారి. హతులలో యూసఫ్ అజహర్, అబ్దుల్ మాలిక్ రౌఫ్, ముదాసిర్ ఆహ్మద్ తదితరులు ఉన్నారని ఆర్మీ డిజిఎంఓ రాజీవ్‌ఘాయ్ తెలిపారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి నుంచి నాకు ప్రాణహాని

- హతమారుస్తామంటూ ఇంటికొచ్చి బెదిరించారంటూ పోలీసులకు దస్తగిరి ఫిర్యాదు

**ప్రజాశక్తి- పులివెందుల టౌన్**

కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి నుంచి తనకు నుంచి ప్రాణహాని ఉందంటూ పోలీసులకు దస్తగిరి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆయన నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. శనివారం రాత్రి కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డితోపాటు 20 మంది తన ఇంటికి వచ్చారని, తనను గొంతుకోసి చంపుతామని బెదిరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో దస్తగిరి పేర్కొన్నారు. ఫిర్యాదు చేయడానికి ఆదివారం ఉదయం డిఎస్‌పికి కార్యాలయానికి ఆయన వెళ్లారు. డిఎస్‌పి మురళీనాయక్ అందుబాటులో లేకపోవడంతో కొద్దిసేపు అక్కడే ఉండి తిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ నారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దస్తగిరి ఇంటి పరిసరాల్లో ముగ్గురు అనుమానంగా తిరుగుతుండడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి ఇప్పటికే 2+2 పోలీస్ భద్రత ఉంది.

## పశుగ్రాసం ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

పచ్చగడ్డి కొరత ఎదుర్కొంటున్న జిల్లాల్లో ఏజన్సీ ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా ఉండటం విశేషం. అదేవిధంగా, అన్నమయ్య, చిత్తూరు, గుంటూరు, పల్నాడు, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు తరువాత స్థానంలో నిలిచాయి. ఎండుగడ్డి కొరత ఎదుర్కొంటున్న జిల్లాల్లో అనకాపల్లి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అదేవిధంగా, అల్లూరి సీతారామరాజు, అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, వైఎస్ఆర్ కడప, ప్రకాశం జిల్లాలు తరువాతి స్థానంలో నిలిచాయి. పశుగ్రాసం కొరత కారణంగా పాడిరైతులు వారి పశువులను మేపలేని పరిస్థితిలో తక్కువ ధరలకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా జిల్లాల్లో పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు పశువుల పెంపకాన్ని విడిచిపెడుతున్న సందర్భాలున్నాయి. పచ్చిగ్రాసం లోటు ఉన్న చోట్ల ఎండుగడ్డి ఇచ్చి సమతుల్యం చేస్తామని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నా, ఎండుగడ్డి కేవలం తిరుపతి జిల్లాలోనే 16.8 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా ఉంది. ఇతర జిల్లాల్లో అంత ఎక్కువ మొత్తంలో అందుబాటులో లేదు.

## ఐదుగురు జవాన్ల వీరమరణం : సైన్యం వెల్లడి

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ఐదుగురు సైనికులు మరణించారని భారత సైన్యం వెల్లడించింది. సాయుధ దళాలకు చెందిన ఈ ఐదుగురు సైనికుల సేవలను దేశం చిరకాలం గుర్తుంచుకుంటుందని తెలిపింది. మరోవైపు ఈ నెల 7 నుంచి 10 మధ్య నియంత్రణ రేఖ వద్ద జరిగిన కాల్పుల్లో పాకిస్తాన్ సైన్యం సుమారు 35 నుంచి 40 మంది సిబ్బందిని కోల్పోయిందని వెల్లడించింది.

**గాయపడిన బిఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి**

పాకిస్తాన్ కాల్పుల్లో గాయపడిన బిఎస్ఎఫ్ కానిస్టేబుల్ దీపక్ చింగ్ఖం చికిత్స పొందుతూ ఆదివారం మణించారు. ఈ విషయాన్ని బిఎస్ఎఫ్ తన సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించింది. జమ్మూ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఆర్ఎస్ పురా ప్రాంతంలో శనివారం పాక్ జరిపిన కాల్పుల్లో దీపక్ తీవ్రంగా గాయపడ్డారు. దీపక్ మృతికి బిఎస్ఎఫ్ సంతాపం ప్రకటించింది. జమ్మూ ప్రధాన కార్యాలయం, పలౌర వద్ద సోమవారం దీపక్‌కు నివాళి కార్యక్రమం ఉంటుందని తెలిపింది.

**కన్నీటి వీడ్కోలు**

పాకిస్తాన్ కాల్పుల్లో మరణించిన సైనికుడికి జమ్మూలోని స్వగ్రామంలో ఆదివారం కన్నీటితో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఆర్ఎస్ పురా సెక్టార్‌లోని జమ్మూకాశ్మీర్ లైట్ ఇన్ ఫాంట్రీ రెజిమెంట్-4లో విధులు నిర్వహిస్తున్న రైఫిల్‌మాన్ సునీల్ కుమార్ (25) శనివారం తెల్లవారు జామున పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో మరణించారు. ఆదివారం పూర్తిగా సైనిక గౌరవాలతో సునీల్ కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు. అలంకరించిన సైనిక వాహనంలో సునీల్ కుమార్ భౌతికకాయాన్ని గ్రామానికి తీసుకొనివచ్చారు. చివరి చూపుకోసం తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో పాటు వందలాదిగా గ్రామస్తులు తరలివచ్చారు. దేశాన్ని, సైన్యాన్ని కీర్తిస్తూ నినాదాలు చేశారు.

## హైదరాబాద్ మెట్రో రైల్‌కు 'హార్వర్డ్' గుర్తింపు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ప్రాజెక్ట్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థ హార్వర్డ్ యూనివర్సిటీ ఈ ప్రాజెక్ట్‌ను కేస్ స్టడీగా తీసుకొని, 'హైదరాబాద్ మెట్రో- ఆలోచన నుంచి అమలు వరకు.. పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్ట్' అనే శీర్షికతో హార్వర్డ్ బిజినెస్ రివ్యూ జర్నల్‌లో పరిశోధనా పత్రం ప్రచురించింది. హార్వర్డ్ రిపోర్ట్ ప్రకారం, హెచ్ఎంఆర్ ప్రపంచంలోనే అతిపెద్ద పిపిపి మెట్రో ప్రాజెక్ట్‌గా గుర్తింపు పొందింది. 2006లో ఎన్‌విఎస్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఈ ఐడియా తెచ్చారు.

కావ్య గానాన్ని ఆలపిస్తున్న అశోక్ తేజ

## త్రివేణి సంగమం భిన్నత్వంలో ఏకత్వానికి సందేశం

**కవి, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ**

**ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి**

తెల్లని గంగమ్మ నల్లని యుమన, ఛామనచాయ సరస్వతితో సంగమించి త్రివేణి సంగమం భిన్నత్వంలో ఏకంగా చాటుతోందని కవి, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన శ్రీ శూద్రగంగ 'కావ్య గాన సభ'లో ఆయన గానాన్ని ఆలపించారు. గంగ, యుమున, సరస్వతిలతో సంగమించిన భారతదేశం ఏకైక మత దేశమని ఉన్మాద పీడకుల కనుపొరలు, చెవిపొరలు తెరిపించిందన్నారు. వర్ణమంటే కులం కాదురా పిచ్చోడా వాతావరణ, భౌగోళిక మేళవింపుతో సంక్రమించిన బంగారు వర్ణమని చాటి చెప్పిందన్నారు. మనుషులంతా మానవీయపు పుడమి మడుగులో బుడగలని, చివరి మాటగా చెప్తూ మనిషి గీసిన దేశ సరిహద్దులను దాటి బంగాళాఖాతంలో ఖాతా తెరిచిందని చెప్పారు. ప్రకృతి సమతుల్యాన్ని వికృతిగా మార్చేయడంతో గంగ ఏవగిస్తూ పరిశుద్ధ గంగలా ప్రవహించేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేరని పాలకులను ప్రశ్నిస్తోందన్నారు. పారిశ్రామికవేత్తల డబ్బుల కక్కుర్తికి అలవాటు పడిన పాలకుల ముఖంపై గంగ ప్రశ్నలను ఉమ్మిందన్నారు. పారిశ్రామికులు వదిలే విష రసాయనాలతో తన కంట విషాద వదనం కనిపిస్తోందన్నారు. అన్నదాతల ఆర్తి తీర్చిన తర్వాతే గుడుల్లో తీర్థమవుతానంటూ గంగ భూమిపైకి వచ్చిందన్నారు. తాను శ్రీ భారతీ శూద్ర గంగనని ఒక శాశ్వత సత్య ప్రమాణ వాక్కు పలికిందన్నారు. ఏ దేశంలో శూద్రులు నివసిస్తారో, ఆ దేశంలోనే గంగ ప్రవహిస్తోందటూ తన కావ్యాన్ని ముగించారు. ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు కావ్యాన్ని పరిచయం చేశారు. సాహితీ స్రవంతి కార్యదర్శి కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షత వహించిన సభలో కవి కంచరాన భుజంగరావు, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ తెలుగు అధ్యాపకులు కె ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి డెల్టా రైతుల ఆశలపై నీళ్లు!

- క్లోజర్ పనులకు అరకొరగా నిధులు
- రూ.40 కోట్లు మాత్రమే కేటాయించిన ప్రభుత్వం
- పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని రైతుల డిమాండ్

గోదావరి నదిపై కాటన్ బ్యారేజ్

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి**

గోదావరి డెల్టా కాలువలు మూసి వేసిన తర్వాత చేపట్టే క్లోజర్ పనులు ఈ ఏడాదీ మొక్కుబడిగా సాగనున్నాయి. ప్రభుత్వం అరకొరగా నిధులు కేటాయించడమే ఇందుకు కారణం. గోదావరి డెల్టా కింద ఉభయగోదావరి జిల్లాల్లో పది లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వల ద్వారా సాగు నీరు సరఫరా అవుతోంది. తూర్పు డెల్టా పొడవు 268.614 కాగా, మధ్య డెల్టా 226.83 కిలోమీటటర్ల పొడవునా కాల్వల నిర్వహణ కీలకమైనది. తూడు, గుర్రపు డెక్కను తొలగించడానికి,, కాల్వల లాకులు నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ఏటా మే పదిన కాల్వలకు నీటి సరఫరా నిలిపివేసిన అనంతరం నిర్వహణ పనులు చేపట్టడం పరిపాటి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని మొత్తం 18 నియోజకవర్గాల్లో ఈ పనులు చేయాల్సి ఉంది. 2022లో రూ.85 కోట్లు, 2023లో రూ.65 కోట్ల చొప్పున నిధులు కేటాయించిన అప్పటి వైసిపి ప్రభుత్వం 2024 ఎన్నికల ముందు పూర్తిగా మొండిచేయి చూపించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ముందు టిడిపి కూటమి నేతలు ఈ సమస్యను ప్రధాన ఎజెండాగా తీసుకున్నారు. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున రూ.180 కోట్ల విలువైన క్లోజర్ పనులు చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం క్లోజర్ పనులకు రూ.70 కోట్లు అవసరమని జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అధికారంలోకి వచ్చిన తొలి వేసవి పనులకు టిడిపి కూటమి ప్రభుత్వం మొక్కుబడిగా నిధులు కేటాయించింది. కేవలం రూ.40 కోట్లు విదిల్చి చేతులు దులుపుకుంది. వాస్తవానికి క్లోజర్ సమయంలో కాలువల్లో పూడికల తొలగింపు లాకులు, స్లూయిజ్‌లు, డైరెక్ట్ పైప్ (డిపి)ల మరమ్మతులు, గ్రీజులు పెట్టడం, కొత్త షట్టర్ల వేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. మధ్య డెల్టాలో లొల్ల లాకుల నుంచి శివారు కాట్రేనికోన మండలం మొక్కలతిప్ప వద్ద ఉన్న చిన్నపాటి రెగ్యులేటర్ వరకూ లాకులు, షట్టర్లు అధ్వానంగా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షం కురిస్తే డ్రెయిన్లలో నీరుసరిగా ప్రవహించక పంట పొలాలు ఏటా ముంపునకు గురవుతున్నాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో గోదావరిలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ కాలువ నుంచి నీటి ప్రవాహం సరిగా లేక ఆయకట్టు శివారు ప్రాంతాలకు నీరందలేదు. రబీ పంట కాలం పూర్తవడంతో గోదావరి డెల్టా ప్రధాన పంట కాలువలకు జల వనరుల శాఖ అధికారులు గత నెలలో క్లోజర్ ప్రకటించారు. తిరిగి జూన్ ఒకటిన కాలువలు తెరిచే అవకాశం ఉంది. కేవలం మూడు వారాల్లో పంట కాలువల్లో పూడికతీత, ఇతర మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంటుంది. గోదావరి ఇన్‌ఫ్లో జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకూ కాటన్ బ్యారేజీ వద్ద 4,368.813 టిఎంసిలు నమోదైంది. దీనిలో కాలువలకు 252,098 టిఎంసిలు అందించగా 4,114,715 టిఎంసిల మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. రైతుల అవసరాల మేరకైనా ఎగువ నుంచి వస్తున్న జలాలను వినియోగించుకునే విధంగా ప్రభుత్వం కనీస ఆలోచన చెయ్యడం లేదు. పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని, సాగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**నేటి నుంచి పనులు**

గోదావరి డెల్టా పరిధిలో సోమవారం నుంచి క్లోజర్ పనులు ప్రారంభం కానున్నాయి. కాల్వలలో నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేలా నీటి సంఘాల ద్వారా పనులు చేయిస్తాం. రూ.10 లక్షలకు మించిన పనులకు టెండర్లు పిలవనున్నాం. నెల రోజుల్లో ఈ పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాం.

**-కె.గోపీనాథ్, ఎస్ఇ, జలవనరుల శాఖ తూర్పుగోదావరి జిల్లా.**

## కర్రెగుట్టల్లో మళ్లీ కూంబింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో పోలీసులు, కేంద్ర పారామిలటరీ బలగాలు ఆదివారం మళ్లీ కూంబింగ్ ప్రారంభించాయి. నాలుగు రోజుల క్రితం కర్రెగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత పోలీసులు కాస్త నెమ్మదించారు. మందుపాతర్లు లేవని నిర్ధారించుకున్న తర్వాతే ముందడుగు వేస్తున్నారు. అయితే, దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర బలగాలకు పిలుపు రావడంతో గత రెండు రోజులుగా కర్రెగుట్టల్లో కూంబింగ్ నిలిపివేశారు. సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు మళ్లీ కర్రెగుట్టలపై దృష్టి పెట్టారు. స్టేట్ క్యాంపుల్లో ఉన్న బలగాలు మళ్లీ కర్రె గుట్టలకు చేరుకుని స్థానిక పోలీసులతో కలిసి జల్లెడ పడుతున్నాయి.

## రేపు కళ్ళితండాకు జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న సత్యసాయి జిల్లాలోని కళ్ళితండాకు వెళ్లనున్నారు. తండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. మంగళవారం ఉదయం 11:30 గంటలకు మురళీనాయక్ నివాసంలో ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు తిరిగి బయలు దేరుతారని పార్టీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

## కార్మికుల ఆటో బోల్తా..

- 34 మందికి గాయాలు

ప్రజాశక్తి-పొన్నలూరు (ప్రకాశం జిల్లా)

కార్మికులతో వెళుతున్న ఆటో బోల్తా పడిన ఘటనలో 34 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ప్రకాశం జిల్లా పొన్నలూరులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరుకు చెందిన 34 మంది కార్మికులు పొగాకు గ్రేడింగ్ కోసం రెడ్డిపాలెంకు ఆటోలో వెళ్తున్నారు. పొన్నలూరులోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కార్మికులంతా చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. ఎటువంటి ప్రాణనష్టమూ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కువ మంది కూలీలను ఆటోలలో ఎక్కించడం వల్లే ఆటో బోల్తా పడిందని స్థానికులు తెలిపారు.

## లారీని ఢీకొన్న కారు

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు (శ్రీ సత్యసాయి జిల్లా)

మరణించిన వ్యక్తిని చూడటానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన రిటైర్డ్ లెక్చరర్ వేణుగోపాల్‌కు చెందిన బంధువు అనంతపురంలో మృతిచెందగా చూసేందుకు తమ సమీప బంధువులైన చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జయచంద్ర, కానిస్టేబుల్ చలపతి, లెక్చరర్ నాగేంద్రతో కలిసి కారులో వచ్చారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కారు శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి సమీపంలో ఆగి ఉన్న టిప్పర్ లారీని ఢీకొని.. పక్కనే ఉన్న చెట్టును బలంగా గుద్దుకుంది. ఈ ప్రమాదంలో జయచంద్ర (60), చలపతి (56), నాగేంద్ర (58) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన వేణుగోపాల్‌ను చికిత్స నిమిత్తం కదిరి ఆస్పత్రి తరలించారు. మృతులు ముగ్గురు అన్నదమ్ములు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. కదిరి సిఐ నాగేంద్ర, తనకల్లు ఎస్ఐ గోపీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# 2030 నాటికీ అనుమానమే?

- విశాఖ మెట్రో మరింత జాప్యం
- డిపిఆర్ ఆమోదంపై కేంద్రం మీనమేషాలు
- ఎపి మెట్రో ప్రీ-బిడ్డింగ్ సమావేశంలో కన్సల్టెంట్ నియామకంపై చర్చ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎపి మెట్రో రైల్ కార్పొరేషన్ కార్యాలయం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టు 2030 నాటికీ అందుబాటులోకి రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. .బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ విశాఖపట్నంలో మెట్రో రైల్ 2029 నాటికి పూర్తవుతుందని పేర్కొన్న సంగతి తెలిసిందే. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు 2026 జూన్‌కు కొలిక్కి వచ్చే అవకాశం ఉండడంతో విశాఖ నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు చేసే ప్రయాణికుల పరిస్థితిపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చర్చించింది. అయితే, కన్సల్టెంట్‌ను నియమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ఎయిర్ పోర్టు పనులు పూర్తయి మెట్రో రైలు అంశం కొలిక్కి రాకపోతే ఎలా? అన్న స్థితిలో ఈ ఎయిర్‌పోర్టును నిర్మిస్తున్న జిఎంఆర్‌లోనూ ఆందోళన నెలకొంది. దీంతో ప్రీ బిడ్డింగ్ సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినా కన్సల్టెంట్‌లు ఎవ్వరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ విషయంపై ఎపి మెట్రో ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ యుజెఎం.రావు మాట్లాడుతూ 'దఫదఫాలుగా చర్చలు చేయడం ద్వారా మెట్రోకు సానుకూలత వస్తుంది. పనులపై ఇంకా ఎలాంటి ఆమోదాలూ ముందుకు సాగలేదు. ఢిల్లీ స్థాయిలో మెట్రోపై సమాలోచనలు నడుస్తున్నాయి' అని 'ప్రజాశక్తి'కి తెలిపారు. చంద్రబాబు హయాంలో 2014-2019 మధ్య కాలంలో ఒకదఫా, 2019-2024 జగన్ హయాంలో మరో దఫా విశాఖ మెట్రో సవివరణ నివేదిక (డిపిఆర్)ను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. పై రెండు సందర్భాల్లోనూ బిజెపియే దేశంలో అధికారంలో ఉన్నా డిపిఆర్ పట్ల సుముఖత వ్యక్తం చేయలేదు.

**కేంద్ర పౌరవిమానయాన మంత్రి సమీక్ష**

ఇటీవల జరిగిన మెట్రో సమీక్షా సమావేశంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'ఇదొక అత్యవసర పరిస్థితి. ఒక పక్క విమానాశ్రయం సిద్ధమవుతోంది. మెట్రో రైలును అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది' అని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం నుంచి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రూ.4,500 కోట్లతో ప్రాజెక్టు మొదట దశ పనులు పూర్తి కానున్నాయని వెల్లడించారు. ఎపి మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎంఆర్‌సిఎల్) కన్సల్టెంట్ అంశం జూన్ తొమ్మిదిన ఖరారు అవుతుందని, ప్రాజెక్టును ప్లాన్ చేయడానికి, టెండరుకు, పర్యవేక్షించడానికి ఈ కన్సల్టెంట్ అవసరమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

**సవాలక్ష సమస్యల మధ్య 'మెట్రో'**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వంద శాతం నిధులను సమకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల కేంద్రాన్ని కోరినట్లు సమాచారం. సవరించిన డిపిఆర్ ప్రకారం మెట్రో రైలు కేవలం 46.23 కిలోమీటర్ల నెట్‌వర్క్‌ను మాత్రమే కలిగి ఉంటుంది. కూర్మన్నపాలెం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ నడువనుంది. దీనికి రూ.11498 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో అన్నిటికంటే ప్రధాన విషయంగా భూ సేకరణ ఉందని ఎపి మెట్రో రైల్ కార్పొరేషన్ సిఎమ్‌డి యుజెఎం.రావు తెలిపారు. రూ.800 కోట్ల మేర నిధులు తక్షణావసరం కాగా, కన్సల్టెంట్ నియామకం జరిగితేనే ఈ నిధులు సమకూరతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పనులు ప్రారంభిస్తే మెట్రో రైలు పూర్తి కావడానికి కనీసం ఆరేళ్ల సమయం పట్టనుండడంతో 2030 సంవత్సరానికైనా అతీగతి ఉంటుందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

## ప్రాంతీయ అసమానతలపై ప్రణాళిక అవసరం

- విద్య, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహనకు జెవివి ప్రత్యేక కృషి

ప్రజాశక్తి - కర్నూలు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పాలకుల వద్ద సరైన ప్రణాళికలు లేవని, ప్రధానంగా విద్య వైద్య రంగంలో, అభివృద్ధిలో రాయలసీమ, ఉత్తరాంధ్రను వెనుకబాటుతనం ఉందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల జనవిజ్ఞాన వేదిక (జెవివి) ప్రాంతీయ వర్క్‌షాప్ నంద్యాల జిల్లా డోన్‌లోని శ్రీసుధ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ అభివృద్ధి అంటే కుబేరుల ఆస్తులు పెంచడం, ఫ్లైఓవర్లు కట్టడం కాదని సామాన్యునికి అభివృద్ధి ఫలాలు అందాలని అన్నారు. శాస్త్ర సాంకేతికత విధానాలు సామాన్య ప్రజలకు అనుకూలంగా ఉండాలని సూచించారు. దేశంలో కుల మతాల పేరులో ప్రజలకు విడదీయడం, డబ్బుతో రాజకీయాలు చేయడం పెరిగిందని, ఇది సరైంది కాదన్నారు. 70 శాతం మందికి పౌష్టికాహారం అందించలేకున్నామని తెలిపారు. చదువుకోడం కోసం అనంతపురం జిల్లా నుంచి విజయవాడలోని స్కూళ్లకు వెళుతున్నారని, ఇక్కడ సరైన విద్య అందుబాటులో లేకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇంటికో పారిశ్రామిక వేత్తను ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి ప్రణాళిక అవసరమని, పాలకులు ఆ దిశగా దృష్టి కేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొని విద్య, వైద్యం, పర్యావరణంపై సరైన అధ్యయనం చేసి, ప్రజలను చైతన్య పరచడానికి జెవివి పని చేస్తోందని చెప్పారు. ప్రాంతానికి వెయ్యి మంది చొప్పున శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల రాష్ట్రంలో తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నాయని, సామాన్యుల ఉపశమనం కోసం సామూహిక శీతల శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 40 శాతం ఉష్ణోగ్రతలు దాటితే వడగాల్పులపై రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినా నిధులు కేటాయించలేదన్నారు. వడగాల్పులకు గురైతే చనిపోయే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిలో ప్రతి గంటికు ఒక లీటరు చల్లని నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. విలేకరుల సమావేశంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రరామారావు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మానిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉక్కు' నిర్వాసితుల త్యాగాలను అపహాస్యం చేయొద్దు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు నిర్వాసితుల త్యాగాలను పాలకులు అపహాస్యం చేయొద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పి శ్రీనివాసరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1550వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను అకారణంగా తొలగించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులలో ప్రధానంగా ఉక్కు నిర్వాసితులే అధికంగా ఉన్నారని తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు సమయంలో వారంతా భూములు, ఇళ్లు త్యాగం చేయగా వారికి ఉపాధి కల్పిస్తామని ఆనాటి ప్రభుత్వం హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వారి త్యాగాన్ని అపహాస్యం చేయడం తగునా? అని పాలకులను ప్రశ్నించారు. కార్మికుల హక్కుల కోసం ఈ నెల 20న దేశ వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను స్టీల్‌ప్లాంట్ కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, నాయకులు వివి రమణ పాల్గొన్నారు.

# 3కె రన్ శారీ వాక్

**ప్రారంభించిన ఈగల్ ఐజి రవికృష్ణ**

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రన్‌లో పాల్గొన్న మహిళలు

అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా నేతన్నల కోసం వి వైబ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ నుంచి గౌతమ్ బుద్ధ రోడ్డులోని బస్టాండ్ సెంటర్ వరకు ఆదివారం 3కె రన్ శారీ వాక్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈగల్ ఐజి ఎ రవికృష్ణ, సినీనటి నాగళ్ల అనన్య, తెలుగు మహిళ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షులు గద్దె అనురాధ ప్రారంభించారు. నేతన్న తయారుచేసిన వస్త్రాలతో మహిళల ఫ్యాషన్ షో జరిగింది. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ తల్లి మాట వింటే అభివృద్ధవుతారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్ నియంత్రణకు ఈగల్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నామని, మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు నివాళులర్పించారు. గద్దె అనురాధ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని, నారా భువనేశ్వరి చెప్పినట్లు విని మంత్రి నారా లోకేష్ మంచి రాజకీయ నాయకుడిగా ఎదుగుతూ రాష్ట్ర అభివద్ధికి తోడ్పడుతున్నారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అమరావతి రాజధానిని కాపాడడంలో తల్లుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా బాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వి వైబ్ సంస్థ చైర్మన్ రాఘ వీణ, టిడిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## నేడు డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు

- సమస్యలు పరిష్కరించకుంటే విద్యాభవన్ ముట్టడి
- యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల పున:వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారమై పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారి కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు యుటిఎఫ్ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో ప్రతివారం విద్యాశాఖ అధికారులు చర్చలు జరుపుతున్నారని, అయినా ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖ అధికారులు స్పందించకుండా ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని వివరించారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీనం, జిఓ 117 పేరుతో సర్దుబాటు ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని పేర్కొన్నారు. దీనివల్ల 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జిఓను రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరమన్నారు. కొత్తగా 779 ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం, 9,652 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో 54 మంది విద్యార్థులుంటేనే రెండో పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల వేలాది పోస్టులు ఈ పాఠశాలల్లో సర్‌ప్లస్ అవుతున్నాయని వివరించారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లను నిర్వీర్యం చేస్తున్నారని, ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో 46 మంది విద్యార్థులుంటే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ఏప్రిల్ నాటి రోల్ ఆధారంగా పోస్టుల కేటాయింపు చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లను యుపి, హైస్కూళ్లల్లోనే వినియోగించాలని సూచించారు. అలాగే బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా 2021 తర్వాత రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 15న వేలాది మంది ఉపాధ్యాయులతో విద్యాభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆ పరిస్థితి రాకుండా విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## తేలని ఆర్థిక లెక్కలు

- కాగ్ ఎదురుచూపులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లెక్కలు ఇంకా తేలలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు పూర్తిస్థాయి వివరాలు ఇంకా రాలేదని కాగ్ చెబుతున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక శాఖకు కాగ్ నుంచి లేఖ కూడా వచ్చినట్లు సమాచారం. ఈ లెక్కలు వస్తేనే కాగ్ అధికారికంగా వార్షిక నివేదికను ప్రకటించే అవకాశాలున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై రాష్ట్ర ఆర్థికశాఖ వివరాలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే ఆర్థిక సంవత్సరం ముగిసి మే నెల కూడా వచ్చేసినా ఇప్పటి వరకు ఈ లెక్కలు మాత్రం సిద్ధం కాలేదని సమాచారం. కాగ్‌కు సమర్పించాల్సిన నివేదికలో అనేక అంశాలను వివరించాల్సి ఉంటుంది. రంగాల వారీ వచ్చిన సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చిన నిధులు, తీసుకున్న రుణాలు, వివిధ పథకాలకు పలు విత్త సంస్థల నుంచి వచ్చిన రుణాల వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నిధులను ఎంత వరకు ఖర్చు చేశారు, ఆదాయ వ్యయాల మధ్య అంతరం, ఆదాయ, ద్రవ్య లోటు వివరాలు కాగ్‌కు సమర్పించాలి. వీటన్నింటినీ క్రోఢీకరించుకున్న తరువాత కాగ్ ముందుగా సాధారణ వార్షిక నివేదికను ప్రకటించి, ఆ తరువాత పూర్తిస్థాయి నివేదికను ప్రకటించాల్సి ఉంది.

ఏప్రిల్ ముగిసి, మే సగం వరకు వచ్చేసినా ఇప్పటి వరకు ఈ వివరాలు కాగ్‌కు చేరలేదని అధికారులు అంటున్నారు. ప్రధానంగా రుణాల విషయంలోనే రాష్ట్ర ఆర్థికశాఖ తటపటాయిస్తున్నట్లు కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇవే వివరాల సమర్పణ లేకుండాపోతోందని, ఈ వివరాలు తప్ప మిగిలిన వివరాలు కాగ్‌కు సమర్పిస్తున్నారని సమాచారం. దీనిపై కాగ్ కూడా అనేక సందర్భాల్లో రాష్ట్ర ఆర్థికశాఖకు లేఖలు కూడా రాసింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు, పలు సంస్థలకు గ్యారంటీలు ఇచ్చి తీసుకున్న అప్పుల వివరాలు సిద్ధం చేయలేదని సమాచారం. అందుకే వార్షిక నివేదిక సిద్ధం చేయడంలో జాప్యం అవుతోందని తెలుస్తోంది.

తుళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, రైతు కార్మికులు తదితరులు

## సైనికుల త్యాగాలు మరువలేనివి

- రాజధానిలో ర్యాలీ

**ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా):** సైనికుల త్యాగాలు మరువలేనివంటూ వారికి సంఘీభావం తెలుపుతూ ఆదివారం రాజధాని ప్రాంతం తుళ్లూరులో రైతులు, రైతు కార్మికులు, వివిధ పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన జవాన్ మురళీ నాయక్‌తో పాటు మరో ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలో జాతీయ జెండాలను చేతబట్టి భద్రతా దళాలకు దేశం యావత్తూ అండగా ఉంటుందని నినాదాలు చేశారు. చిన్నారులు సైతం సైనికులకు సెల్యూట్ అంటూ ర్యాలీ వెంట నడిచారు. ర్యాలీలో కాటా అప్పారావు, కొమ్మినేని సత్యనారాయణ, జె కిరణ్ కుమార్, పువ్వాడ సురేంద్ర, జమ్ముల అనిల్, నీరుకొండ లక్ష్మీనారాయణ, గడ్డం వెంకటేశ్వరరావు, గోవిందమ్మ, అరుంధతి, అంకం సువర్ణకమల తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ కొలువు ఉత్సవంలో ఘటాలను ఊరేగిస్తున్న ప్రజలు

## వైభవంగా మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మన్య ప్రజల ఆరాధ్య దేవతగా పేరుగాంచిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఆదివారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఈ నెల 13 వరకూ జరిగే ఉత్సవాలకు జిల్లా కేంద్రమైన పాడేరులో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ చైర్మన్ విశ్వేశ్వరరాజు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు తదితరులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను, ఘటాలను ఉత్సాహపూరిత వాతావరణంలో ఊరేగించారు. ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన శతకం పట్టు వరకు ఊరేగింపు కొనసాగింది. అక్కడ అమ్మవారిని కొలువుదీర్చారు. పులి వేషాలు, థింసా, అమ్మవార్ల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో పాడేరు పులకించింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, మాజీ మంత్రి బాలరాజు తదితరులు కొలువు ఉత్సవంలో అమ్మవారి పాదాలను ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పాడేరులోని ఉత్సవ ప్రాంగణంలో గిరిజనుల సందర్శనార్థం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, జిల్లా అధికారులు ప్రారంభించారు. సమాచార, పౌర సంబంధాల శాఖ, కాఫీ, వ్యవసాయ, ఉద్యాన, విడివికె, జిసిసి, ఐసిడిఎస్, వైద్య, ఆరోగ్య శాఖలు ఈ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఐటిడిఎ పరిపాలన అధికారి ఎం.హేమలత, డిపిఆర్ఒ పి.గోవింద రాజులు, డివిజినల్ పిఆర్ఒ పి.రాములు, కాఫీ విభాగం ఎడి అప్పలనాయుడు, డిహెచ్ఒ రమేష్ కుమారరావు ఏర్పాట్లను, స్టాళ్లను పర్యవేక్షించారు.

## ఆశాల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి
- పాడె మోసి నివాళులర్పించిన యూనియన్ నేతలు
- క్షతగాత్రులకు ప్రభుత్వాస్పత్రిలో పరామర్శ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి /పమిడిముక్కల

జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు ఆశా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనలో మరణించిన వి.దుర్గ, టి.విజయలక్ష్మి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా గూడూరు మండలం తరకటూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన పమిడిముక్కల మండలం గోపువానిపాలెం గ్రామానికి చెందిన తాడేపల్లి విజయలక్ష్మి, తాడంకి గ్రామానికి చెందిన ఊటుకూరి దుర్గ భౌతికకాయాలను ధనలక్ష్మితోపాటు యూనియన్ కృష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కుమారి, ధనశ్రీ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వారి పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆటో ప్రమాదంలో గాయపడి మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా కార్యకర్తలు జి.నిర్మల జ్యోతి, నాగమలేశ్వరి, శ్రీవాణిలను పరామర్శించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, వారి పిల్లలకు ఆధారం చూపాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాయపడిన వారు పూర్తిగా కోలుకునే వరకు పూర్తి వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది క్రితం ఆశాలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ అమలు చేస్తే ఆశాల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రమాదంలో మరణించిన ఆశాల కుటుంబాలకు, గాయపడిన వారికి యూనియన్ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆశాలు మరణించడం బాధాకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు స్వరూప, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్లం వెంకటేశ్వరరావు, మాదల వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా, నగర నాయకులు శివనాగేంద్రం, స్వరూపరాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజయలక్ష్మి, దుర్గ అంతిమయాత్రలో పాడె మోస్తున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కుమారి, ధనశ్రీ తదితరులు

## 'హేతుబద్ధీకరణ' టీచర్లకు న్యాయం చేయండి : టిఎన్‌యుఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హేతుబద్ధీకరణకు గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిఓ 117 వల్ల 2023లో వేలాది మంది ఉపాధ్యాయులు ఒకే పాఠశాలలో 8 ఏళ్లు పూర్తికాకుండానే రేషనలైజేషన్‌కు గురై ఇబ్బంది పడ్డారని తెలిపారు. త్వరలో జరగబోయే హేతుబద్ధీకరణలో తయారుచేసిన నిబంధనల్లో కొన్ని అసంబద్ధాలు ఉన్నాయన్నారు. దీనివల్ల గతంలో హేతుబద్ధీకరణకు గురైన ఉపాధ్యాయులే ఇబ్బందిపడనున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి పాత స్టేషన్ పాయింట్స్, రేషనలైజేషన్‌లో 5 పాయింట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## బిల్‌గేట్స్ రూ.9 లక్షల కోట్లు దానం

**న్యూఢిల్లీ :** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్‌గేట్స్ తన సంపదలో 99 శాతాన్ని గేట్స్ ఫౌండేషన్‌కు దానం చేయబోతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుత లెక్కల ప్రకారం.. బిల్‌గేట్స్ సంపదలో 99 శాతం అంటే 107 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీ ప్రకారం రూ.9 లక్షల కోట్లు. ఈ డబ్బును పూర్తిగా ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన వంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించి, ఆపై సంస్థను శాశ్వతంగా మూసివేయాలని యోచిస్తున్నారు.

75వ వర్ధంతి

అమరజీవి కా॥ చల్లపల్లి నారాయణరావు
స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రగతిశీల ప్రజానాయకుడు,
సంఘసంస్కర్త, బడుగువర్గాల ఆశాజ్యోతి అయిన అమరజీవికి మా నివాళులు...
అమరజీవి చల్లపల్లి నారాయణరావు
మెమోరియల్ సొసైటీ, హైదరాబాద్. సెల్: 9848813994

# అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 12 మే 2025

"మతములన్నియు
మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్ ..."
- గురజాడ

## మిగిలిన దుఃఖం

యుద్ధం అంటే
పిల్లలు, స్త్రీల చావులే కదా!
నువ్వు పెంచుకున్న
కుక్క పిల్లా, పిల్లి పిల్లా
ఆవు దూడలు, పూల మొక్కలు
ఆ మట్టి దిబ్బలో కూరుకుపోతాయి

ప్రతిరోజూ తిరిగే
గుడి మసీదు చర్చి కూలిపోతాయి
జ్వరమొస్తే వెళ్లే ఆసుపత్రి
అక్షరం దిద్దిన వీధి మొదటిలోని బడీ
పెళ్ళలుగా మారి గుండెల్లో
గుబులు పుట్టిస్తాయి

ఇళ్లన్నీ బూడిద కుప్పలుగా మారి
శ్మశానంలా కళ్ళముందర మిగులుతుంది
అది నువ్వు ప్రేమించిన వారిదైనా
ద్వేషించిన వారిదైనా
నువ్వు వెతుక్కునే బొమికల కుప్పలో గుర్తించ లేక
బతికుండి శవంలా మిగులుతావు

కానీ, వాడు ఓట్లు దండుకుని
మరొకసారి సింహాసనంలో కూచుని
చిద్విలాసంగా నవ్వుకుంటాడు
ఇవేవీ పట్టనివాడు
ఇరువైపులా ఆయుధాలు అమ్ముకుని
బొక్కసం నింపుకుంటాడు
నువ్వూ నేనూ ఇదంతా టీవీలో చూస్తూ
అయ్యో అని నిట్టూర్చడం తప్ప ఏం చేయగలం?
కాసింత మిగిలిన కన్నీళ్లను
తుడుచుకోవడం తప్ప ఏం చేయగలం?

– కెక్యూబ్ వర్మ
94934 36277

## నిజం

నిప్పుల మంటల్లో ఓట్లు ఏరుకుంటున్నారు
కొంపలు కాలిపోతుంటే
గెలుపు గుర్రాల్ని ఎంచుకుంటున్నారు
జరిగిన దాడిని ఖండిస్తూనే
తొందరగా ఆ వీడియోలను
ప్రచార గుర్రంగా వాడుకోవాలని ఆరాటం!
చనిపోయింది మన భారతీయులేనని
కాల్చింది దుర్మార్గపు ఉగ్రవాదులే అని మరిచి
బలైపోయిన వారిలో మతాన్ని వెతకటం దౌర్భాగ్యం!

మన నిఘా కనులు మూతపడ్డాయి
భద్రత సోలిపోయింది
అక్కడ మందీ మార్బలం పల్చబడింది
ఖచ్చితంగా పిరికివాళ్ళే దొంగదాడి చేస్తారు
మానవులంతా ఒక్కటే
మనం భారతీయులం
హిందూ ముస్లిం క్రిస్టియన్ ఎవరైనా మానవుడే
మానవత్వమే గెలుస్తుంది
మూర్ఖత్వం దుర్మార్గం ఉగ్రవాదం ఓడిపోతాయి.
మానవత్వం గెలిచి తీరుతుంది!

– జివిఎన్ చలపతి

## మధ్యవర్తి

వీధిలో గొడవలకు
వైట్‌హౌస్ హడావిడి
పిలవని పేరంటానికి ట్రంప్,
పీటపట్టుకు ఎవర్ రెడీ
పోట్లాడు ఇద్దరూ పొమ్మంటే,
మధ్యలోకి వద్దంటే,
పెద్దన్నకు నామోషీ
ఆదికి ముందు తీర్పులిచ్చి
పోరు తీర్చానని
బీరాలు పోతాడు ఆ పెద్దమనిషి.

(ఇండియా – పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ గురించి ఈ దేశాల కన్నా ముందుగా ప్రకటించిన ట్రంప్)

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931

## గాలి

హఠాత్తుగా ఒక గాలి వీచింది
గాలి వీయటానికి అనేక కారణాలు వుండవచ్చు
గాలి వీయాల్సిన అవసరం అంతగా లేకపోయినా
గాలిని వీయనిచ్చారులా వుంది
గాలిలో కొట్టుకుపోయేవాళ్లెప్పుడూ వుంటారు
గాలిమాటలను వేదవాక్కులుగా స్వీకరించి
అమలు పరిచేవాళ్లు ఎప్పుడూ వుంటారు
నిజానికి గాలిలో ఎండుటాకుల్లా ఎగిరిపోయేవాళ్లు
గాలిలో ప్రయాణించేవాళ్లు
గాలిని రక్తి కట్టించేవాళ్లు మాత్రమే
దేహమ్మీద మొలిచిన చెమట చుక్కలు
గాలికి ఆవిరవుతున్నా
గాలిలో తమవాళ్లే అందరూ
చెట్లలా కూలిపోతున్నా
గాలికి బతుకునిచ్చినివాళ్లు
గాలినే సర్వస్వంగా భావించి చరించేవాళ్లు
గాలిమాటల్ని పసిగట్టినా
దేశమ్మీదికి ఎలాంటి చెడుగాలులు వీయకుండా
వటవృక్షాల్లా నిలబడుతూనే వుంటారు
గాలి తుపానులా చెలరేగి
పచ్చని చెట్లలా కూలిపోతూనే వుంటారు
ఎటొచ్చీ గాలిని పుట్టించి
మంటలను ఎగదోసిన వాళ్లు
గాలి తుపానుకు చిక్కకుండా
దేశ సరిహద్దులకు లోపల
హిమగదుల్లో గాలిని ఎగదోస్తూ
కాలం గడుపుతూ వుంటా
కురుస్తున్న తూటాల వర్షం సాక్షిగా
రాలిపడుతున్న ప్రాణాలను చూసి
గాలి పథకం ఫలించిందని
చంకలు గుద్దుకుంటూ వుంటారు
గాలిలో దీపాలవుతున్నది మాత్రం
గాలిని కాంక్షించని వాళ్లు
ప్రచండంగా వీచే గాలితో పనిలేదు
బుక్కెడు బువ్వతో మాత్రమే మాకు పనియని
తెల్లని పావురాలకు ఊపిరులూది
గుండె గుప్పెట్లోంచి గాలిలోకి ఎగరేస్తూ
ఆశగా ఆకాశంకేసి చూస్తున్నవాళ్లే
గాలికి రాలిపడుతున్న అనేక ప్రాణాల సాక్షిగా
గాలికి ప్రాణాలడ్డుపెట్టి
పోరాడుతున్న నా సోదరులను
కోల్పోతున్న దేశం సాక్షిగా
తుపాను యగాలి సద్దుమణిగి
శాంతిపావురం వాలే రోజుకోసమే
దేశమంతా ఎదురుచూస్తోంది!

– చిత్తలూరి

# 'సురభి' సమాలోచన .. సంస్కరణల యోచన

## ప్రదర్శనల మెరుగుదలపై సదస్సు

హైదరాబాద్‌లో జరిగిన సురభి సదస్సులో పాల్గొన్న సురభి సమాజాల ప్రతినిధులు, మధ్యలో వ్యాసకర్త రంగారెడ్డి

సురభిలాంటి ప్రొఫెషనల్ రంగస్థల సంస్థ మనకు గర్వకారణం. సురభి మన జాతి సంపద. నాటకం పునరుజ్జీవానికి, సురభి లాంటి కమిటెడ్ కళాకారులకు ప్రభుత్వాలు తగిన వసతులు కల్పించాలి. తెలుగు నాటకానికి జీవం పోసిన వాళ్ల బతుకులు బాగున్నప్పుడే మన నాటకం పూర్వ వైభవాన్ని సంతరించుకున్నట్టు. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజానిది. సురభి వారి సాంకేతికతను నేటి రంగస్థలానికి పునాది చేసుకుంటేనే నాటక భవిష్యత్ భద్రంగా ఉంటుంది. కాలానుగుణంగా సమకాలీన అంశాలపై శాస్త్రీయ.. జన జాగృత అవగాహనతో సామాజిక వికాసానికీ దోహదపడే సాంఘిక సమస్యలను ప్రతిబింబిస్తూ నాటకాలను రూపొందించాలి. అప్పుడే నాటకరంగం కొత్త పుంతలు తొక్కుతుంది.." అని అంటున్నారు ప్రముఖ నాటకరంగ పరిశోధకులు, ప్రజా కళా ఉద్యమ సంస్థల వారు. సురభి ప్రదర్శనల ప్రొడక్షన్ కాపీలు తీసుకుని ఆధునిక విధానంతో తులనాత్మక పరిశీలన చేస్తే ఎంతైనా ప్రయోజనం ఉంటుందని నిష్ణాతుల భావన. ఇలాంటి అభిప్రాయాల వెలుగులో.. మార్చి 15 – 20 తేదీల్లో విజయవాడలో జరిగిన సురభి కళా మహోత్సవం నేపథ్యంలో.. మే 4న హైదరాబాద్‌లో 'సురభి' మేధోమథన సదస్సు జరిగింది. విజయవాడ మహోత్సవాన్ని పర్యవేక్షించిన కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ దక్షిణ భారత (తంజావూరు– ఎటాచ్డ్) 'ఠాగూర్ ఫెలో', 'సురభి' పరిశోధకురాలు పురాణం మాధవి ఆధ్వర్యంలో సెమినార్ మూడు విభాగాలుగా జరిగింది. 140 ఏళ్లు పైబడిన 'సురభి'లో 80, 70 ఏళ్ళు దాటిన రఘునాథ్, పూర్ణచంద్రరావు, ఎస్.ఎ.శ్రీకృష్ణదేవరాయలు నుంచి 20 – 25 దాటని 'భావి భరోసాలు' నిఖిలేష్, భార్గవ్, భాగ్యలక్ష్మి ఇత్యాదుల వరకూ నార్కట్పల్లి, వరంగల్ సహా హైదరాబాద్ సురభి కాలనీ నుంచి అన్ని వయసుల వారూ, సమాజాల వారూ పెద్ద సంఖ్యలో పాల్గొని.. మేధో మథనం జరిపారు. 'సురభి' వ్యవస్థాపకులు వనారస గోవిందరావు, చిన్న రామయ్య వంటి పెద్దల్ని భక్తిప్రపత్తులతో స్మరించుకున్నారు. ప్రస్తుత పరిస్థితులనూ భిన్న.. వాస్తవిక.. ఆచరణ సాధ్య కోణాల్నుంచి నిశితంగా ఆత్మశోధన చేసుకున్నారు. ప్రక్షాళన ఆవశ్యకతనూ పలువురు వక్కాణించారు. ప్రభుత్వం, సమాజం వైపు నుంచి అందాల్సిన సహకారం గురించీ ప్రస్తావించారు. విజయవాడ మహోత్సవంపై ఇదే పుటలో మార్చి 24న వచ్చిన విమర్శనాత్మక సమీక్షను అందరూ ఏకోన్ముఖంగా అంగీకరించడం వారి నిజాయితీకీ, కట్టుబాటుకూ నిదర్శనం.

### లోపాలు ఎందుకు?

కొన్ని నాటక ప్రదర్శనల్లో జరుగుతున్న లోపాలు.. తప్పిదాలపై (రివ్యూను ఉటంకిస్తూ) పలువురు ప్రస్తావించారు. వాటిలో కొన్ని ముఖ్యమైనవి :

- సాంఘిక నాటకం మీద మాకు వ్యతిరేకత లేదు. మా పూర్వీకులూ ఆడారు.. మేమూ కొన్ని ప్రదర్శనలిచ్చాం. 'సురభి' అనగానే భారీ ఎఫెక్టులు, వైర్ ట్రిక్ వర్క్స్, జిగేలుమనే ఆభరణాల కాస్ట్యూమ్స్, క్షణాల్లో మారిపోయే సీనరీ సెట్టింగ్స్ గట్రా ఆశిస్తారు ప్రేక్షకులు. ఇవన్నీ సాంఘిక నాటకాల్లో అవసరం ఉండవు. పద్య నాటకం సురభి సాంప్రదాయం. సాంఘిక నాటకం మమ్మల్ని సాకలేకపోయింది. కుటుంబాలకు కుటుంబాలు మొత్తం రంగస్థలం పనుల్లో భాగస్తులమవుతాం. సాంఘిక నాటకంలో ఆ అవకాశం ఉండదు. అందుకే పౌరాణిక, జానపద నాటకాలనే ప్రధానంగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నాం.
- పర్ఫెక్షన్‌కు సంబంధించి.. ఒక్కో నాటకంలో అన్ని పనుల్లో 30–40 మందికి తగ్గకుండా ఉంటాం. ప్రదర్శనల అవకాశాలు అంతంతమాత్రంగా ఉండటంతో.. ఖర్చులు భరించలేక తగినన్ని రిహార్సల్స్ చేయలేకపోవడమే ప్రదర్శనలో లోపాలకు ప్రధాన కారణం. ఒకరి డైలాగ్ పూర్తవ్వకుండానే వేరొకరు డైలాగ్ ఎత్తేయడం వంటి తప్పిదాలు కూడా ఇందుకే. చాలా సందర్భాల్లో ప్రదర్శన రోజునే అందరం కలుస్తాం అంటే మా పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.
- వైర్ వర్క్ ట్రిక్స్ కొన్నిసార్లు అంతగా వర్కౌట్ కాకపోవడానికి సంబంధించి.. ఆఖరి నిమిషంలో మారే పాత్రధారుల కారణంగా ట్రిక్స్ విఫలమవుతుంటాయి.
- మాకు ప్రత్యేక శిక్షణ ఉండదు. పెద్దవాళ్లను ఫాలో అవుతుంటాం. కాలం గడుస్తున్న కొద్దీ తప్పిదాలు పెరుగుతుంటాయి. పద్యం పట్ల కూడా అంతే. ప్రత్యేక సాధన చేయకపోవడమే వ్యక్తిగతంగా ప్రధాన లోపం.
- నాటకాల ప్రదర్శనకు అంతగా అవకాశాలు రాక– అనివార్యమై పలువురు.. సెక్యూరిటీ గార్డు వంటి చిన్న చిన్న ఉద్యోగాలకు, రోజువారీ కూలి పనులకు వెళ్తుండడంతో ప్రదర్శన సమయంలో దొరకరు. అవసరం మేరకు హార్మోనిస్టులు సహా టెక్నీషియన్స్ అలభ్యతా... సాంకేతికాంశాలకు సంబంధించి ఓ ప్రధాన సమస్యే.

### 'సురభి' ఏం కోరుతోంది?

సురభి నాటక ప్రదర్శనా ప్రాభవం కొనసాగటానికి ఏం కావాలో పలువురు చెప్పారు. ఆ అంశాల్లో ప్రధానమైన కొన్ని :

- థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులకు 'సురభి'లో ఇంటర్న్ షిప్ ఇప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలి. నాటకానికి అవసరమైన సబ్జెక్టుల్లో సురభి వారికి నిరంతరం శిక్షణ ఇస్తుండాలి (భార్గవ్– సురభి నాటక కళా సంఘం)
- తరచూ నాటకరంగ వర్క్ షాప్స్ నిర్వహించాలి
- కూడు, గూడు, విద్య, వైద్యం సహా ఇతర కనీస సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. (వి.నిఖిలేష్– సురభిళ నాట్య కళా మండలి)

తొలి సెషన్లో శ్రీవినాయక నాట్యమండలి అధినేత ఆర్.వేణుగోపాలరావు చర్చలను ప్రారంభిస్తూ– 'మనం బతకడం కోసం కాదు.. నాటకాన్ని బతికించాలి. నటీనటులు భాష పట్ల ప్రత్యేక శ్రద్ధపెట్టాలి.' అన్నారు. నాటకాన్ని బతికించుకోవడానికి జరగాల్సిన కృషిలో ఎన్నో లోపాలుంటున్నాయని అలనాటి టెక్నీషియన్ సురభి పూర్ణచంద్రశేఖర్ (శ్రీ శారదా మనోవినోదిని) ఆవేదన చెందారు. సురభి ప్రదర్శనల్లో బయటి వారు పాల్గొనడాన్ని కొందరు ఆక్షేపిస్తున్నారని, కానీ, బయటి వారు కూడా తోడైతేనే మనం మరింతగా విజయవంతమవుతామని స్పష్టం చేశారు. క్యారెక్టర్ ఫిట్నెస్ విషయంలో మొదటి నుంచీ ఎందుకో అంత పట్టింపు లేదని జయచంద్ర వర్మ (శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్) పేర్కొన్నారు. పదిహేనేళ్ల వయసు వరకూ నత్తి ఉన్న తనను తల్లి పదే పదే.. అదే పనిగా సాధన చేయించడంతో క్రమంగా బెటరై 'భక్త ప్రహ్లాద'లో హిరణ్యకశిపుడు సహా అనేక ప్రధాన పాత్రలు పోషిస్తున్నానని వర్మ చెప్పారు. ముఖ్య అతిథి, సదస్సు సోల్ మోడరేటర్ రంగారెడ్డి సూచన మేరకు సభికులు ఆ మాతృమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. పదుగురమూ కలిసి ఉంటున్నాం కాబట్టి ఈ మేరకైనా ప్రదర్శనలివ్వగలుగు తున్నామని ఆర్.నాగబాబు (శ్రీభానోదయ నాట్యమండలి) భావించారు. డబ్బుకు కాకుండా నాటకానికి ప్రాధాన్యతిస్తేనే నాటకం బతుకుతుందని, ఐక్యంగా పురోగమిద్దామని ఆకాంక్షించారు. కొందరు డబ్బు, పేరు కోసం వెంపర్లాడు తున్నారని యువ కిశోరం భార్గవ్ నిరసించారు. సమాజాల మధ్య పొరపొచ్చాలు, వ్యక్తిగత వైషమ్యాల కారణంగా నాటకం స్థాయి దిగజారుతోందని విచారం వ్యక్తంచేశారు. కొందరికి మార్కెటింగ్ మీద ఉన్న శ్రద్ధ ప్రొడక్షన్ మీద ఉండటం లేదని ఆక్షేపించారు. సురభి ప్రదర్శనల్లో బయటి సమాజాల వారు పాల్గొనడం హర్షణీయం, అవసరం అన్నారు. మరో యువకుడు వి.నిఖిలేష్ మాట్లాడుతూ, నాటకం బతకాలంటే సరైన నటులు, దర్శకులు, రచయితలు, పీఆర్వోలు ఉండాలన్నారు. నాటకం గొప్పగా తయారయితే పీఆర్వోల ద్వారా మరెన్నో అవకాశాలు దక్కించుకోవొచ్చన్నారు. సమకాలీన అంశాలను 'సురభి'కి జోడించుకుని క్వాలిటీ నాటకాలను విజయవంతంగా ప్రదర్శిద్దామని అన్నారు.

సింధూరి రమేష్ (సురభి కళా నేత్ర) మాట్లాడుతూ, "సురభిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. సురభికి అంతం లేదు. ఇంతమంది కళాకారులు ఎక్కడ ఉంటారు! వాస్తవ పరిస్థితుల్ని క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకోవాలి." అన్నారు. కళాకారులకు ఉపాధి పెంచే మార్గం ఆలోచించాలని ఆర్.జయానంద్ (సురభి డ్రామా థియేటర్) ప్రభుత్వాన్ని కోరారు.

మహిళా సెషన్‌లో సురభి ఆర్.పద్మజమ్మ (60), ఎస్.ఎ.నిర్మల (63), పుష్పలత (66), హారిక వర్మ, ఎస్.ఆర్.రమాలక్ష్మి (52), సురభి యామిని, సురభి జ్యోతి, ఎస్.ఎ.భాగ్యలక్ష్మి తదితరులు మాట్లాడారు. పెన్షన్ విషయం వృద్ధులు ప్రస్తావించారు. డబ్బుల్లేక ప్రసవ వేదన పడుతుంటామని జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. సురభి సమాజాల మధ్య 'కమ్యూనికేషన్ గ్యాప్' కొనసాగితే సంస్థల మనుగడకే ముప్పు అని హారిక ఆందోళన చెందారు. సురభి కంపెనీల్లో మాదిరి కాలనీ కళాకారులకూ నెలవారీ వేతనాలుండాలని యామిని కాంక్షించారు. కాలనీ, పిల్లల కోసం ప్రభుత్వం సాయమందించాలన్నారు. సమష్టి కృషివల్లే 'సురభి' మనుగడ సాగుతుందని.. విద్యలో గురువుల పర్ఫెక్షన్– ప్రదర్శనకు మరింత భరోసా అని భాగ్యలక్ష్మి భావించారు.

టెక్నికల్ సెషన్‌లో … నాటకానికి ఎఫెక్టులు సపోర్ట్‌గా ఉండాలి తప్ప.. ఎఫెక్టులే నాటకం కాకూడదని పూర్ణచంద్రరావు స్థిరంగా అభిప్రాయపడ్డారు. అయితే.. 'సురభి' నుంచి ప్రేక్షకులు ఎఫెక్టుల్ని ఆశిస్తారని ఉమాశంకర్ (సురభి నాటక కళా సంఘం) పేర్కొన్నారు. చెవులు మూసుకుని సురభి నాటకాన్ని చూస్తే అత్యద్భుతం అంటారు పలువురు అని పలువురి నవ్వుల మధ్య తెలిపారు. దురదృష్టవశాత్తూ ఇటీవల అభివృద్ధి చేసిన ఎఫెక్టులు కూడా అంతగా లేవన్నారు. సదస్సులో శ్రీవిజయభారతి నాట్యమండలి, సురభి కళా సంగమం, శ్రీబాలాజీ సురభి థియేటర్, సురభి నాట్య కళామండలి సహా అనేక సమాజాల వారు పాల్గొన్నారు.

అందరూ ముక్తకంఠంతో అంగీకరించిన లోపాల్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు (సాధ్యమైన) అన్ని ప్రయత్నాలూ సిన్సియర్‌గా చేస్తేనే ఇలాంటి సదస్సులు సత్ఫలితాలు సాధించినట్టనుకోవాలి. ఈ బృహత్ కర్తవ్యాన్ని ప్రధానంగా నవ యువ కిశోరాలు తమ భుజస్కంధాలపై వేసుకోవాలి. అనుభవజ్ఞులు నడిపించాలి. మొత్తంగా చూసుకున్నప్పుడు సెమినార్‌లో అందరూ తమ ముందు దర్పణం ఉంచుకున్నారు. తమను తాము పరిశీలించుకున్నారు. ఏదో.. ఎప్పుడో అవసరం మేరకు కొందరం కొద్దిసేపు మాట్లాడుకోవడం తప్ప.. ఇంతమందిమి మొదటిసారిగా ఒక చోట కూడి అనేకానేక అతి ముఖ్యమైన అంశాల్ని, సమస్యల్ని సాకల్యంగా ఫలప్రదంగా చర్చించుకోవడానికీ ఆవేదన, ఆందోళన సైతం కలబోసుకోవడానికీ అవకాశం కల్పించిన సెమినార్ నిర్వాహకులకు ప్రతి ఒక్కరూ ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సదస్సులు మళ్లీ మళ్లీ జరుగుతుండాలని అభిలషించారు. సురభీయులందరికీ పురాణం వెంకట్, ఐశ్వర్య ఆత్మీయ ఆతిథ్యమిచ్చారు.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్
99126 15747

## ఏం సాధించావ్?

మసీదు మీద, మందిరం మీద వాలుతున్న
ఆ పావురాల గుంపును చూశావా?
ఈ లోకాన శాంతి దూతలు కదా
వలవేసి పట్టి వాటి తలలు తుంచి
నీవు ఏం సాధించావ్...?

ఈ మంచు శిఖరాలు
అందాల లేక్ దాల్ సరస్సులు
కుంకుమపూల వనాలు
కాశ్మీర్ యాపిల్ పండ్ల తోటలు ఆకుపచ్చ లోయలు
ఈ అందాల ప్రకృతిని విధ్వంసం చేసి
ఇంతకీ నీవు ఏం సాధించావ్?

ఆ మంచు పూల పల్లకీ ఎక్కి
అందాల లోయల్లో ఆనందంగా
విహరిస్తున్న విహార యాత్రికులను
మతోన్మాద మత్తులో క్రూరంగా చంపి
ఏం సాధించావ్...?
జీవనదులు పుట్టిన హరిత భూమిలో
నెత్తుటి నదులను పారించి
నీవు ఏం సాధించావ్...?

ఈ మానవతాశకలాల నడుమ
ముక్కలైన పవిత్ర గ్రంథాల వాక్యాలు
తుపాకీ పట్టిన వాడి ప్రాణం
తుపాకీ తూటాలోనే వుంటుంది అన్నట్టు
నువ్వు ఒక యుద్ధభూమిని నిర్మించావు
ఒక శవాలతో నిండిన శ్మశానాన్ని
నీ దేశానికి కానుకగా ఇచ్చావు
అందులోనే నీవు సైతం
సాతానుగా కప్పబడ్డావు!

సోదరుడా,
నీవు ఒక ప్రేమ మందిరాన్ని
నిర్మించి చూడు
అందులో నీవు దైవంగా
ప్రతిష్ఠించ బడతావు

– సరికొండ నరసింహ రాజు
93982 54545

# అపూర్వ గణిత విజ్ఞాన సాహిత్య వల్లరి

**"... విశాల విశ్వమున భూరి రహస్యములెల్ల విప్ప**
**ఈ మానవజాతి మన్గడకు మంచియగున్ గణితమ్ము వల్లనే–"**
**"గణితము సౌందర్యమునకు వినియోగమునకు నెలవని వివరింపదగున్**
**వినియోగము సేవక వత్తిని సౌందర్యమ్ముదాత్త తేజము దెలుపున్"**
**"పరిశీలన పరిశోధనలిరు తెరుగుల వద్ధి గోరి హేరాళముగా**
**వరలను గణిత నమూనాల్ కోరముట్టై శాస్త్ర ప్రగతి కొరకిద్దరలో""**



–అని ఆచార్య పుదూరు విశ్వనాథ అరుణాచలం (1935–2020) గణిత శాస్త్ర ప్రయోజనాన్నీ, ఇంకా గణితానికుండే సేవక స్వభావాన్ని, సౌందర్య ఉదాత్తతను చాలా స్పష్టంగా చెప్పడమే కాక– ఈ శాస్త్రానికి సంబంధించి అబ్జర్వేషన్, రీసెర్చ్ విభాగాల్లో మ్యాథమెటికల్ మోడల్స్ ఎలా దోహదపడతాయో కూడా ఈ 'సంగవిద' తొలి పుటల్లోనే ద్యోతకమవుతుంది.

'సంగవిద' అనేది 'సంక్షిప్త గణిత విశ్వదర్శని' అనేదానికి సంక్షిప్త రూపం. నాలుగు మాటల్లోని తొలి అక్షరాలను స్వీకరించి, కొత్త అక్షర సమ్మేళనాన్ని డా.పివి అరుణాచలం సృజించారు. అంటే శ్రీరంగం శ్రీనివాసరావుని శ్రీశ్రీ అనడం లాగా అన్నమాట. పెద్దలు అరుణాచలం హైస్కూల్ స్థాయిలో 'కసాగు' , 'గసాభా' తరహాలోనే వీరు 'లంబ స్పర్శ రేఖల ఖండన బిందు పథం' అనే దానిని 'లస్పథం' అని వాడారు. అలాగే, 'వక్ర నాభుల మార్గం' అనేదానికి 'వనామార్గం' అనే ప్రయోగం చేశారు.

తర్వాత ఈ పుస్తకం పేరులోనే బ్రాకెట్లో గణితము ప్లస్ సాహిత్యము అని కూడా కనబడుతోంది. అంటే ఇందులో మ్యాథమేటిక్స్, లిటరేచర్ కలిసి ఉంటాయని రచయిత/ కవి సూచిస్తున్నారు. దీన్నే మరో విధంగా చెప్పాలంటే వస్తువు గణితమైతే, వ్యక్తీకరణ సాహిత్యరూపం అంటే పద్యం. పుస్తకం శీర్షిక కింద గణితాత్మకమైన పరిభాషలో కొన్ని చిహ్నాలు కూడా వాడారు. శ్రీశ్రీ పదబంధాలను అనుకరిస్తూ, ఆ స్టాంజాలో ముప్పాతికను స్వీకరిస్తూ "గణితమ్మొక పద్మవ్యూహం... కవిత్వమొక తీరని దాహం" అని అంటారు.

imagination is more important than knowledge అని శాస్త్ర లోకపు కుల గురువైన Albert Einstein అంటారు. ఇదే విషయాన్ని అరుణాచలం కవితాత్మకంగా "జ్ఞానము కన్నను ప్రముఖమైనవి భావమ్ములూహలని నుడివిన ఐన్ స్టైను" అని పద్యానువాదం ఇందులోనే కనబడుతుంది. దీన్ని లోతుగా పరికిస్తే మరిన్ని విషయాలు మరింత మార్మికంగా మనకే గోచరమవుతాయి. అందుకే ఆ ఐన్‌స్టైన్ మహాశయుడే Pure Mathematics is in its way, the poetry of logical ideas అని చెప్పిన విషయాన్ని ముందు పేజీలోనే రచయిత గుర్తు చేస్తారు. అంతేకాదు, గణిత శాస్త్రజ్ఞుడు సంపూర్ణం కావాలంటే ఎంతో కొంత కవిత్వాంశ ఉండాలని Karl Weierstrass చెప్పిన మాటను కూడా గుర్తు చేస్తారు. ఇంకా Sofia Kovalevskaya మహనీయుడు "ఆత్మలో కవి కానివాడు, గణిత శాస్త్రజ్ఞుడు కానేకా"డని చెప్పిన సంగతిని ఇక్కడే గుర్తు చేస్తారు. GK Chesterton ఇదే భావనను ఇంకొంచెం సృజనాత్మకంగా, "కవి స్వర్గలోకంలోకి తల దూర్చాలని ప్రయత్నిస్తే– గణిత శాస్త్రవేత్త ఆ స్వర్గాలోకాలనే తన మస్తిష్కంలోకి అమర్చుకోవాలని వాంఛిస్తా"రని అదిరిపోయేట్టు చెప్పారు. గణితం, కవిత్వం ఈ రెండిటిని సమన్వయం చేసిన మహాతత్వవేత్తలను, ఉత్తమ సాహితీమూర్తులను అన్వేషించి వారు చెప్పిన ఉత్తమ అభిప్రాయాలను మనకందించారు అరుణాచలం. ఒకరికి మించిన రీతిలో మరొకరు చెప్పిన భాషితాలను చూస్తే కొంగొత్త తాత్విక దృక్కోణాలు తరిచి చూచేకొద్దీ తారసపడతాయి. అదే సమయంలో ఆచార్య అరుణాచలం ఎంత కాలంగా ఈ ప్రత్యేకమైన బాణీలో అధ్యయనం చేశారో కొంత అవగాహన కూడా కలిగే అవకాశం ఉంది.

ఇందులో తెలుగువారు, భారతీయులు, ఆసియావాసులు, ప్రపంచవాసులు ... ఇలా ఎంతోమందిని అలాగే ఇప్పుడు ఉన్నవారితో పాటు గతంలో గొప్ప చరిత్రను సృష్టించి మహనీయులుగా నిలిచిపోయిన వారి గొప్పతనం లేదా వారు రూపొందించిన పద్ధతి లేదా సూత్రం మొదలైన వాటిని క్లిష్టమైనవిగా పేరు గాంచిన కందపద్యాల్లో సులువుగా వ్యక్తీకరించారు. పద్య నిర్మాణానికి సంబంధించి మాట్లాడినప్పుడు అరుణాచలాన్ని కవి అని మాత్రమే సంబోధించాలి, ఎందుకంటే వారి సాహితీ నైపుణ్యం ఆ స్థాయిలో ఉంది. తెలుగు పద్య నిర్మాణంలో అత్యంత జటిలమైనదని పేరుగాంచిన కందపద్యాన్నే ఈ రచనలో విస్తృతంగా వాడారు. దీనికంటే ముందు ఆయన ఈ విషయాలను చెప్పడానికి వచనం కాకుండా ఛందోబద్ధమైన పద్య ప్రక్రియను ఎందుకు ఎంచుకున్నారని కూడా కొంత తర్కించాలి. మాటలు చెప్పలేని మన మెలో డ్రామాని, మనో సంక్లిష్టతను చెప్పడానికి సినిమాలో పాట అవసరమవుతుందని వేటూరి సుందర రామ్మూర్తి ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్టు గుర్తు. కొందరికి ఐదారు పద్యాలు లేదా ఇంకొంచెం ఎక్కువ రాసి ఉండవచ్చు. అదే సమయంలో ముగ్గురికి, ఆ మాటకొస్తే బెర్నౌలి వంశపు శాస్త్రవేత్తలు ఎనిమిది మందికి కలిపి ఒక పద్యం రాసిన సందర్భం వంటివి కూడా ఈ పుస్తకంలో కనబడతాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నట్టు వచనమంటే విజ్ఞానమే. దీనినే మనం ఇంకోరకంగా తర్కించి పద్యం అంటే కొంత మార్మికతే అని కూడా చెప్పుకోవాల్సి ఉంది. ఆయా గణిత శాస్త్రపు వ్యక్తుల కృషిలో లేదా ఫలితాల్లో నెలకొన్న జీవన మకరంద పద్య వ్యక్తీకరణలో ఏదో ఒక రకమైన మేలి ముసుగు వంటి మార్మికత లేకపోతే రక్తి కట్టదు. ఒక పద్యం రాసినా, నాలుగు పద్యాలు రాసినా వారు ఆయా వ్యక్తుల జీవన మర్మాలను అధ్యయనం చేసే ఈ పద్యాలను చెక్కారు. నిజానికి మాట్లాడితే ప్రతి శీర్షికా పద్యానికి లేదా పద్యాల మాలికకు నేపథ్యం, ఉద్దేశం, సాధించిన ఫలితం అని మూడు కోణాల్లో పాఠకులకు విశ్లేషించాల్సి ఉంది. మాస్టారు అరుణాచలం గతించిన ఐదు సంవత్సరాలకు ఈ 'సంగవిద' ప్రచురణ సాకారం అవుతున్నది.

**(ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతిగా సేవలందించిన గణిత శాస్త్రజ్ఞులు డాక్టర్ పి.వి.అరుణాచలం జన్మదినం మే 14 (1936) సందర్భంగా త్వరలో రాబోయే రచనకు రాసిన ముందుమాటలో కొంతభాగం)**

– డాక్టర్ నాగసూరి వేణుగోపాల్,
ఆకాశవాణి పూర్వ సంచాలకులు
9440732392

# ఘంటసాల బౌద్ధ వారసత్వం వెలకట్టలేని చరిత్ర

ఘంటసాల ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరాన వెలసిన ఒక మహోన్నత బౌద్ధ క్షేత్రం. సుమారు రెండు వేల ఏళ్ల క్రితం శాతవాహనుల కాలంలో ఇది ఒక ప్రముఖ బౌద్ధ విద్యా, ధ్యాన కేంద్రంగా వికసించింది. ఇక్కడి బుద్ధ విహారాలు, ఉపాసన మండపాలు, ధ్యాన మందిరాలు అప్పట్లో బౌద్ధ తత్వచింతనకు కేంద్ర బిందువులుగా నిలిచాయి. పురావస్తు పరిశోధనలు చెప్తున్నదేమంటే– శ్రీలంక, బర్మా, చైనా, కొరియా వంటి దేశాలకు బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేసిన ధర్మదూతలు ఘంటసాలలో శిక్షణ పొంది వెళ్లారని. నాగార్జున కొండ, అమరావతి, భట్టిప్రోలు వంటి క్షేత్రాలతో కలిసి, ఘంటసాల ఆంధ్ర బౌద్ధ ధారామాతృకకు మార్గదర్శకంగా నిలిచింది.

ఘంటసాల గొప్ప శిల్ప సంపదకు ఆధారంగా నిలిచిన సంఘటన 1920లో జరిగింది. ఒక రైతు తన పొలాన్ని దున్నుతుండగా, కోటదిబ్బ అంచున 60కు పైగా బౌద్ధ శిలా శకలాలు బయటపడ్డాయి. ప్రతి శిల్పం గౌతమ బుద్ధుని జీవితం, జాతక కథను ప్రతిబింబించేలా రూపొందించబడింది. ఆ అద్భుత శిలల్ని కొన్నాళ్లు గ్రామస్థులు పనికిరాని రాళ్ళుగా చెట్టు కింద గుట్టగా ఉంచారు. ఆ తరువాత పుదుచ్చేరి నుంచి వచ్చిన ఒక ఫ్రెంచ్ ఏజెంట్, వాటిని కేవలం రూ.5000కి కొనుగోలు చేశాడు. అలా మన ఘనమైన బౌద్ధ శిల్ప సంపద విదేశాలకు వెళ్లి, ఇప్పుడు ఫ్రాన్స్‌లోని ప్రసిద్ధ మ్యూజీగీమే (వీబబ్లువ +బఋఎవ్)లో ప్రదర్శింపబడుతోంది.

ఈ సంఘటన ఘంటసాల ప్రాచీనతను, కళాత్మక విలువను, ప్రపంచానికి తెలిపే ఒక ఉదాహరణగా నిలుస్తుంది. మన చరిత్రను గుర్తు చేసుకుని, భవిష్యత్ తరాలకు ఈ వారసత్వాన్ని అందించడం మన బాధ్యత. ధానిలో భాగంగా 12.5.2025న జరగబోయే బుద్ధ జయంతిని ఘంటసాలలో నిర్మాణ దశలో ఉన్న వందడుగుల శయన బుద్ధ ప్రాజెక్టులో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో బౌద్ధ సాహితీ చారిత్రిక సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో కె.మణిరత్నం రెడ్డి, గుత్తికొండ సుబ్బారావు, బొర్రా గోవర్ధన్, డా. బెల్లంకొండ రమేష్ చంద్రబాబు, డా. పి.వి.ఎన్.కృష్ణ, సాయి పాపినేని, డా. గాజుల నాగలక్ష్మి, డా.గుడిసేవ విష్ణుప్రసాద్, సవరం వెంకటేశ్వరరావు, బంతే ధమ్మ ధజ థేరో, డా. మొవ్వా శ్రీనివాస రెడ్డి, అంగత వరప్రసాద్ రావు, డా.లీలావతి పామర్తి, మహమ్మద్ సిలార్, గొర్రెపాటి రామకృష్ణ, డా.జి.వి.పూర్ణచందు వంటి పలువురు పత్రసమర్పణలు చేయనున్నారు.

– రేగుళ్ళ మల్లికార్జున రావు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

# వ్యవసాయంలో మహిళా కార్మికులదే కీలక పాత్ర

- బిజెపి పాలనలో పెరిగిన వేధింపులు
- మనువాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం
- వ్యవసాయ, గ్రామీణ మహిళా కార్మికుల జాతీయ కన్వెన్షన్ ముగింపు సభలో నేతలు

వ్యవసాయ, గ్రామీణ మహిళా కార్మికుల సభలో ప్రసగింస్తున్న విజయరాఘవన్, బి. వెంకట్

**ప్రజాశక్తి - మలప్పురం**

దేశ వ్యవసాయోత్పత్తిలో మహిళా కార్మికులదే కీలక పాత్ర అని పలువురు నాయకులు ఉద్ఘాటించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ హయంలో మహిళలపైనా, బాలికలపైనా లైగింక దాడులు, వేధింపులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలోని మలప్పురంలో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ మహిళా కార్మికుల సదస్సు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించారు. సదస్సు ముగింపు సందర్భంగా శనివారం భారీ బహిరంగ సభ జరిగింది. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) నాయకులు కమలకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సభకు గ్రామీణ మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్ తదితరులు ప్రసంగించారు. వ్యవసాయ రంగ ఉత్పత్తిలో నేటికీ మహిళలే కీలక పాత్ర పోషిస్తున్నారని వారు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పని ప్రదేశాలలో మహిళలపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని, వీటికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అత్యాచారాలకు ఒడిగట్టిన దుర్మార్గులకు సంఘ్ పరివార్ మూకలు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై పెరుగుతున్న హత్యలు హత్యాచారాలను నియంత్రించటలో ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మనువాద, కార్పొరేట్ విధానాలతో ప్రజల మధ్య చిచ్చు రాజేసి వనరుల దోపిడి చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా మహిళా కార్మికులను సంఘటితం చేసి పెద్ద ఎత్తున పోరాటాలని చేపడతామని పేర్కొన్నారు. వలస కార్మికులను కేరళ అతిథి కార్మికులుగా గౌరవించి అనేక సంక్షేమ పథకాలు అమల్జేస్తోందని, కానీ అటు కేంద్రం లేదా ఇటు రాష్ట్రాల్లోని బిజెపి, దాని కూటమి ప్రభుత్వాలు వలస కార్మికుల కష్టాలను పట్టించుకోవడం లేదని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పనిని ఎత్తివేసేందుకు బిజెపి కుట్ర పన్నుతుందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామన్నారు. ఆహార భద్రతను బిజెపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, కోట్లాదిమంది ప్రజలు తిండికి లేక అలమటిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందించాలని, భూమి లేని పేదలకు ప్రభుత్వ భూములను పంచాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు పేదలకు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, ఐద్వా నాయకులు సుజాత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్నదాతల ఆత్మహత్యలతో పాటు వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ లేకపోవడంతో పెద్ద ఎత్తున పేదలు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారని పేర్కొన్నారు. పని లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని అన్నారు. ఈ బహిరంగ సభలో రాజ్యసభ ఎంపి వి శివదాసన్, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ కన్వెన్షన్ ప్రధాన నిర్ణయాలు**

- సమాన పనికి సమాన వేతనం. వ్యవసాయ మరియు గ్రామీణ మహిళా కార్మికులకు సమాన పని కోసం సమాన జీతాన్ని నిర్ధారించాలి.
- అసమానతలేని ఉపాధి అవకాశాలు. మహిళలకు వారి నైపుణ్యానికి తగిన పనిని, పురుషులతో సమానంగా వేతనం చెల్లిస్తూ కల్పించాలి.
- పొదుపు, వడ్డీ లేని రుణాల కోసం మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి.
- మహిళా కార్మికులందరికీ వర్తించేలా మాతృత్వ ప్రయోజనాలపై చట్టం చేయాలి. వ్యవసాయ, గ్రామీణ మహిళా కార్మికుల కోసం మాతృత్వ ప్రయోజనాలను హామీ ఇచ్చే చట్టాన్ని తీసుకురావాలి. దీని అమలుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి.
- హానికర రసాయనాల నుంచి రక్షణ కల్పించాలి. పురుగు మందులు, రసాయనాలు, హెర్బిసైడ్లతో పని చేసే మహిళా కార్మికులకు రక్షణ కవచాలు (ప్రొటెక్టివ్ గియర్) ప్రభుత్వమే అందించాలి.
- భూమి హక్కులు, నివాస సౌకర్యం కల్పించాలి. మహిళా కార్మికులకు భూమిపై హక్కును కల్పించి, తగిన నివాస వసతి కూడా అందించాలి.
- పని పరిసరాలలో మెరుగైన సదుపాయాలు కల్పించాలి. శిశు సంరక్షణ కేంద్రాలు (క్రెచ్‌లు) కూడా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. శ్రామికులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలి.
- ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలి. మహిళల పెద్ద ఎత్తున భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ మరింత విస్తరించాలి.
- లైంగిక వేధింపులపై చట్ట అమలు చేయాలి. 2013లో రూపొందించిన "పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం"ను పటిష్టంగా అమలు చేయాలి. త్వరిత న్యాయం కోసం ప్రత్యేక కోర్టులు, పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- వలస మహిళా కార్మికుల సమస్యల పరిష్కారించాలి. వలస మహిళా కార్మికులకు పని ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల్లో గృహ, పారిశుద్ధ్యం, సామాజిక భద్రత వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి.
- ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి. మహిళా వ్యవసాయ, గ్రామీణ కార్మికుల ఆరోగ్య అవసరాలకు తగిన విధంగా స్పందించగల ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి.
- సంపూర్ణ సామాజిక-ఆర్థిక భద్రత కల్పించాలి. మహిళా వ్యవసాయ, గ్రామీణ కార్మికులకు పెన్షన్లు, బీమా, సంక్షేమ పథకాలు ద్వారా సంపూర్ణ సామాజిక, ఆర్థిక భద్రతను హామీ ఇవ్వాలి.

## భారత్-పాక్ కాల్పుల విరమణను స్వాగతించిన పోప్ లియో

**వాటికన్ సిటీ :** భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను పోస్ లియో ఆదివారం స్వాగతించారు. పోప్‌గా ఇటీవలే ఎన్నికైన లియో తన మొదటి ఆదివారం మధ్యాహ్నం ఆశీర్వాదం ఇచ్చారు. సెయింట్ పీటర్స్ బసిలికా లాగ్గియా నుంచి పోప్ లియో మాట్లాడుతూ ఈ కాల్పుల విరమణను స్వాగతించారు. అలాగే, 'రాబోయే చర్చల ద్వారా, త్వరలో శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవాలని నేను ఆశిస్తున్నాను' అని తెలిపారు. అలాగే ఉక్రెయిన్‌లో న్యాయమైన, శాశ్వత శాంతిని నెలకొల్పడానికి పిలుపునిచ్చారు. గాజాలో తక్షణ కాల్పుల విరమణకూ పోప్ లియో పిలుపునిచ్చారు. గాజా, ఇజ్రాయిల్‌ల్లో ఉన్న బందీలను విడుదల చేసిన మానవతా సహాయం అందించాలని కోరారు. 'ఇంకెప్పుడూ యుద్ధం వద్దు' అని పోప్ స్పష్టం చేశారు. 80 ఏళ్ల క్రితం రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, నేడు కూడా ప్రపంచాన్ని నాశనం చేస్తున్న సంఘర్షణలను పోప్ ఖండించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సంఘర్షణలను 'ముక్కలుగా మూడో ప్రపంచ యుద్ధం' అని పోప్ అభివర్ణించారు. అలాగే ఆదివారం మదర్స్ డే సందర్భంగా తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఆదివారం వాటికన్ సిటీ ప్రత్యేక కోలహాలంతో నిండిపోయింది. మార్చింగ్ బ్యాండ్లతో నిండిన జనసమూహం..అభినందనలు, సంగీతంతో వీధుల్లో సందడి చేసింది. చాలా మంది యాత్రీకులు తమ స్వదేశాల జెండాలను పట్టుకున్నారు. వివిధ ప్రత్యేక బృందాలకు పోప్ లియో శుభాకాంక్షలు తెలిపారు.

## అజిత్ దోవల్‌కు చైనా విదేశాంగ మంత్రి ఫోన్

**న్యూఢిల్లీ :** జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి ఆదివారం ఫోన్ ద్వారా సంభాషించారు. భారత్, పాక్ చర్చల ద్వారానే విభేదాలను పరిష్కరించుకుంటాయని, అలాగే శాశ్వత కాల్పుల విరమణను సాధిస్తాయనే విశ్వాసాన్ని చైనా మంత్రి వ్యక్తం చేశారు. దోవల్ మాట్లాడుతూ యుద్ధం భారతదేశం ఎంపిక కాదని, కానీ పహల్గాం దాడి తరువాత ఉగ్రవాద నిరోధక చర్య తీసుకోవాల్సిన అవసరం భారత్‌కు ఉందని చెప్పారు. కాగా, పాకిస్తాన్ ఉపప్రధాని, విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషాక్ దార్‌తో కూడా వాంగ్ యి సంభాషించారు.

## కాశ్మీర్ సమస్య పరిష్కరిస్తా.. వాణిజ్యం పెంచుకుంటా..

- డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

**న్యూఢిల్లీ, వాషింగ్టన్ :** భారత్- పాకిస్తాన్‌తో తమ వాణిజ్యాన్ని మరింత పెంచుకుంటామని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తమ జోక్యంతోనే ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ సాధించామంటూ ఇదివరకే గొప్పలు చెప్పుకున్న ట్రంప్..అమెరికా అసలు లక్ష్యమేంటో ఆదివారం మరో ప్రకటన ద్వారా వెల్లడించారు. వెయ్యేళ్ల కాశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తాము మధ్యవర్తిత్వం వహిస్తామని చెప్పారు. అదే సమయంలో భారత్, పాక్ దేశాలతో వాణిజ్య అవకాశాలను గణనీయంగా పెంచుకుంటామని అసలు విషయాన్ని నిస్సిగ్గుగా అదే ప్రకటనలో వెల్లడించారు. మధ్యవర్తిత్వం పేరిట జోక్యాన్ని పెంచుకొని అనేక దేశాల మధ్య ఆరని చిచ్చులా ఘర్షణలు రాజేసిన అమెరికా ఇప్పుడు భారత్, పాక్ విషయంలోనూ అదే ప్రయత్నం చేస్తోందని పలువురు విమర్శకులు హెచ్చరించారు. ట్రంప్ తాజా పోస్టుపై భారత్ ప్రభుత్వం, అమెరికా విదేశాంగ శాఖ కూడా స్పందించలేదు. అయితే 'వెయ్యి సంవత్సరాల' భారత్-పాకిస్తాన్ వివాదం గురించి ట్రంప్ తప్పుగా ప్రస్తావించడం ఇదే మొదటిసారి కాదు. 2019లో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించడానికి సహాయం చేయమని ప్రధాని మోడీ అభ్యర్థించారని ట్రంప్ తెలిపారు. అయితే అప్పట్లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో దీన్ని ఖండించింది.

## బాదం పాలపై జిఎస్‌టి సబబే

- సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** బాదం పాలపై ఐదు శాతం మేర వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) విధించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. బాదం పాలపై జిఎస్‌టి విధింపునకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రెవెన్యూ శాఖ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ అప్పీలును న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. శ్రీ విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రూలింగ్ ఇస్తూ బాదం పాలను ఎంట్రీ 04029990గా వర్గీకరించింది. దీనిపై ఐదు శాతం జిఎస్‌టి విధించడం సబబేనని స్పష్టం చేసింది. గతంలో మద్రాస్ హైకోర్టు కూడా పార్లే ఆగ్రో కేసులో ఫ్లావర్డ్ మిల్క్‌ను హెచ్ఎస్ఎన్ 0402 కింద వర్గీకరించవచ్చునని, దానిపై ఐదు శాతం జిఎస్‌టి విధించడం సబబేనని తీర్పు చెప్పింది.

తాజా పాలు, పాశ్చరైజ్డ్ పాలను జీఎస్టీ నుండి పూర్తిగా మినహాయించారు. అంతేకాక పాల ఉత్పత్తులైన పెరుగు, లస్సీ, మజ్జిగ, పన్నీర్‌ను కూడా విడిగా అమ్మితే జీఎస్టీ నుండి మినహాయిస్తున్నారు. అయితే ముందుగా ప్యాకింగ్ చేసినా, లేబుల్ రూపంలో ఉన్నా ఐదు శాతం జీఎస్టీ విధిస్తున్నారు. అల్ట్రా-హై టెంపరేచర్ (యూహెచ్‌టీ) పాలపై కూడా ఐదు శాతం జిఎస్‌టి పడుతోంది. ఘనీకృత పాలు, ఫ్లావర్డ్ మిల్క్, వెన్న, నెయ్యి, జున్నుపై అదనంగా 12 శాతం జిఎస్‌టి విధిస్తున్నారు. బాదం పాలు పానీయం కాదని, దానిని 'పాలు' అనే ప్రత్యేక ఎంట్రీ కింద వర్గీకరించడం జరిగిందని సుప్రీంకోర్టు గత డిసెంబరులో రూలింగ్ ఇచ్చింది. అంటే అలాంటి ఉత్పత్తిపై 12 శాతానికి బదులుగా ఐదు శాతం జిఎస్‌టి విధిస్తారు. మామూలు పాలను మాత్రమే ఎంట్రీ 0402 కింద పరిగణనలోకి తీసుకున్నారా అన్న విషయాన్ని న్యాయస్థానం పరిశీలించింది. ఈ ఎంట్రీలో కేవలం పాలనే కాకుండా క్రీమ్, స్కిమ్డ్ పాల పొడి, చంటి పిల్లలకు అందించే మిల్క్ ఫుడ్ వంటి వాటిని కూడా చేర్చారు. మామూలు పాలు, చక్కెరతో కూడిన పాలను కూడా అందులోనే చేర్చడం జరిగింది. ఈ ఎంట్రీలో పాలు, పాల ఉత్పత్తులు ఉంటాయి. ఉదాహరణకు పసి పిల్లలకు అందించే మిల్క్ ఫుడ్‌ను పాలుగా పరిగణించరు. కానీ అది 0402 కింద చేర్చినదిగా పరిగణించారు.

## కొండపై నుండి జారిపడిన బస్సు

- 21 మంది మృతి

**కొలంబో :** శ్రీలంకలో ప్రయాణికుల బస్సు కొండపై నుండి జారి లోయపడిపోయిన ఘటనలో 21 మంది చనిపోయారు. మరికొందరు గాయపడ్డారు. మధ్య శ్రీలంకలో బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించేందుకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పడింది. రాజధాని కొలంబోకు తూర్పున 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొట్మలే పట్టణానికి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. తేయాకు తోటలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో కొండపై నుండి బస్సు జారిపడినట్లు వెల్లడించారు. డ్రైవర్ సహా పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారని, వారిని స్థానిక ఆస్పత్రికి తరలించామని అన్నారు. ఈ బస్సును ప్రభుత్వ ఆధీనంలోని ట్రావెల్ కంపెనీ నడుపుతోందని అన్నారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

## గాజాపై అమానుషదాడులు

- 9 మంది మృతి

**గాజా :** సామాన్యుల ప్రజలను లక్ష్యంగా చేసుకొని గాజాపై ఇజ్రాయిల్ అమానుషదాడులు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి నుండి ఆదివారం వరకు ఇజ్రాయిల్ చేపట్టిన దాడుల్లో తొమ్మిమంది మరణించారు. వారిలో అధికంగా మహిళలు, పిల్లలు ఉన్నారని స్థానిక ఆరోగ్య అధికారులు తెలిపారు. దక్షిణ నగరమైన ఖాన్‌యూనిస్‌లోని తాత్కాలిక శిబిరాలపై రెండు దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇద్దరు పిల్లలు సహా వారి తల్లిదండ్రులు మరణించారు. మూడవదాడిలో మరో పిల్లాడు మరణించాడని, మరో ఏడుగురు గాయపడ్డారని నాజర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ దాడులపై ఇజ్రాయిల్ స్పందించాల్సి వుంది. పదివారాలుగా గాజాలోకి సాయం వెళ్ల కుండా ఇజ్రాయిల్ అడ్డుకుంది. ఆహారం, మందులు మరియు ఇతర నిత్యావసరాలతో కూడిన దిగుమతులను రాకుండా అన్ని దారులను మూసివేసింది. ఆహార నిల్వలు తగ్గిపోతున్నాయని సహాయక బృందాలు పేర్కొన్నాయి. ఆకలితో అధికమంది మరణించవచ్చని హెచ్చరిస్తున్నాయి. సాయం అందేలా చూడాల్సిందిగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచాలని ప్రపంచదేశాలను కోరుతున్నాయి.

## సైనిక కమాండర్లకు పూర్తి అధికారాలు

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్ ఉల్లంఘనలకు పాల్పడిన పక్షంలో తగిన చర్యలు తీసుకునేందుకు సైనిక కమాండర్లకు పూర్తి అధికారాలు అప్పగించారు. పశ్చిమ సరిహద్దులలో నెలకొన్న భద్రతా పరిస్థితిని సైనిక దళాల ప్రధానాధికారి (సిఒఎఎస్) జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆదివారం సమీక్షించారు. 'ఈ నెల 10వ తేదీన డీజీఎంలు ఒక అవగాహనకు వచ్చారు. దీనిని ఉల్లంఘించేలా పాకిస్తాన్ చర్యలకు పాల్పడితే వాటిని ఎదుర్కొనేందుకు సైనిక కమాండర్లకు సిఒఎఎస్ పూర్తి అధికారాలు కల్పించారు' అని సైనిక దళాలకు చెందిన ప్రజా సంబంధాల డైరెక్టర్ జనరల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**నేడు హాట్‌లైన్ చర్చలు**

భారత్-పాకిస్తాన్ మధ్య ఇంకా ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సోమవారం ఇరు దేశాల మధ్య హాట్‌లైన్ చర్చలు జరగనున్నాయి. ఈ చర్చల్లో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ తరువాత కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై భారత్-పాకిస్తాన్ మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ)లు పాల్గొననున్నారు.

## హసీనా పార్టీని నిషేధించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

ఢాకా: మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌ను బంగ్లాదేశ్‌లో నిషేధించినట్లు ఒక నివేదిక తెలిపింది. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఉగ్రవాద నిరోధక చట్టాన్ని ఉపయోగించి ఈ నిషేధాన్ని అమలు చేసింది. ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం నుండి వస్తున్న నివేదికలు త్వరలో అధికారిక ఉత్తర్వు జారీ చేయబడుతుందని చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ (ఐసిటి)లో విచారణ పూర్తయ్యే వరకు అవామీ లీగ్‌పై నిషేధం కొనసాగుతుంది. దేశ భద్రత, సార్వభౌమత్వాన్ని కాపాడే లక్ష్యంతో అవామీ లీగ్‌ను నిషేధించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. జూలై 2024లో జరిగిన నిరసనలో ఫిర్యాదుదారులు, సాక్షులు మరియు పాల్గొన్న వారి భద్రతను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాత్కాలిక ప్రభుత్వం పేర్కొంది.

## దేశ భద్రతపై తక్షణమే పార్లమెంట్ సమావేశాలు

- కాంగ్రెస్ నేతల డిమాండ్
- మోడీకి రాహుల్, ఖర్గే లేఖలు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంతో పాటు దేశ భద్రతపై చర్చించేందుకు వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలు వేరు వేరుగా లేఖలు రాశారు. ప్రతిపక్షాల తరపున లేఖ రాస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్, కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తొలుత ప్రకటించడంపై పార్లమెంట్‌లో చర్చించాలని రాహుల్ తన లేఖలో డిమాండ్ చేశారు. రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి మన సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశమన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణ డిమాండ్‌ను ప్రధాని మోడీ ప్రాముఖ్యతతో పరిశీలిస్తారని విశ్వసిస్తున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పహల్గామ్‌లో జరిగిన అమానుష ఉగ్రవాద దాడి నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 28న లేఖ రాసినట్లు మల్లికార్జున ఖర్గే తన లేఖలో గుర్తు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో పహల్గామ్ ఉగ్రవాదం, ఆపరేషన్ సిందూర్, భారత్ పాకిస్తాన్ కాల్పుల విరమణ, అమెరికా ప్రకటనలపై చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అన్ని ప్రతిపక్ష పార్టీల ఏకగ్రీవ అభ్యర్థనను లోక్‌సభ ప్రతిపక్ష నేత మీకు లేఖ రాసినట్లు గుర్తు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా తాను ఈ అభ్యర్థనను సమర్థిస్తున్నట్లు స్పష్టం చేశారు.

**కాశ్మీర్ సమస్యను అంతర్జాతీకరించడాన్ని వ్యతిరేకిస్తున్నాం: సచిన్ పైలట్**

కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయ అంశంగా మోడీ సర్కార్ చేస్తోన్న ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ తెలిపారు. ఈ విషయంలో అమెరికా మధ్యవర్తిత్వంపై ప్రభుత్వం తన వైఖరిని తెలపాలన్నారు. దేశంలోని తాజా పరిస్థితులపై ప్రధాని నేతృత్వంలో అఖిలపక్ష సమావేశంతో పాటు, తక్షణమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో సచిన్ పైలట్ మీడియాతో మాట్లాడుతూ కాశ్మీర్ సమస్య భారత్ - పాక్ దేశాల మధ్య అని చెప్పే బిజెపి ప్రభుత్వం, మూడో దేశమైన అమెరికా మధ్య వర్తిత్వాన్ని ఎలా అంగీకరించిందని ప్రశ్నించారు. భారత్-పాక్‌లు ఒక తటస్థ వేదికపై సమావేశం అవుతాయని అమెరికా అధికారులు ప్రకనను తప్పుబట్టారు. ఇది కాశ్మీర్ సమస్యను అంతర్జాతీకరించే ప్రయత్నమన్నారు. ఆపరేషన్ సిందూర్ తరువాత ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ షరతులు ఏంటో దేశ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

## రావల్పిండిలోనూ సత్తాచాటాం

- రాజ్‌నాథ్ సింగ్

లక్నోలో బ్రహ్మోస్ తయారీ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్ ఆర్మీ ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోనూ భారత్ సైన్యం సత్తా చాటిందని రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారతదేశపు యొక్క రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం తెలిపారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం దాడులు చేసిందన్నారు. పాకిస్తాన్ సైనిక ప్రధాన కేంద్రమున్న రావల్పిండిలోనూ భారత్ దాడులు జరిగయన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం రాజ్‌నాథ్ మాట్లాడారు. ఉగ్ర శక్తులకు భారత్ దీటుగా బదులిస్తుందన్నారు. ఈ ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదంపై పోరులో భారత్ దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తి సామర్థ్యాలను చాటిచెప్పిందన్నారు. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరిందన్నారు. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదని, కానీ, పాకిస్తాన్ మాత్రం పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసిందన్నారు.

# ఇస్తాంబుల్ వేదికగా చర్చలకు సిద్ధం

- రష్యా, ఉక్రెయిన్ ప్రకటన



**మాస్కో/కీవ్ :** అమెరికా అండదండలతో రష్యాతో కయ్యానికి కాలు దువ్విన ఉక్రెయిన్ ఎట్టకేలకు దిగొచ్చింది. రష్యా సైనిక ఆపరేషన్, ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఇరు దేశాధినేతలు సయోధ్యకు సన్నద్ధమవుతున్నారు. చర్చలకు సిద్ధమని ప్రకటించారు. ఉక్రెయిన్‌ను కట్టడి చేసేందుకు మూడేళ్లుగా తాము సాగిస్తున్న సైనిక పోరాటానికి ముగింపు పలకడానికి కీవ్‌తో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షులు పుతిన్ ప్రకటించారు. ఇప్పటికే తాము మానవతా దృక్పథంతో ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై దాడులను ఆపేశామని, ఈస్టర్ కాల్పుల విరమణ, 'విక్టరీ డే' కాల్పుల విరమణ వంటివి ప్రకటించామని పుతిన్ తెలిపారు. అయినప్పటికీ ఆ సమయాల్లో ఉక్రెయిన్ ఈ ఒప్పందాలను ఉల్లంఘించి.. 524 వైమానిక డ్రోన్‌లు, 45 సముద్ర డ్రోన్‌లు, అనేక పాశ్చాత్య క్షిపణులతో రష్యాపై దాడి చేసిందని చెప్పారు. తమ సైన్యం కీవ్ దాడులను తిప్పి కొట్టిందని తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందం జరగాలంటే ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం ఆలోచనలను విరమించుకోవాలని, తాము ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాల నుంచి వారి బలగాలను ఉపసంహరించుకోవాలని పుతిన్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన కొత్తలో ఇరు దేశాలు సంధి కోసం ముసాయిదా ఒప్పందాన్ని చేసుకున్నాయి. నాటి ఒప్పందం గురించి పుతిన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. అప్పట్లో సంధి చర్చలు విరమించుకుంది తాము కాదని..ఉక్రెయిన్ వాటి నుంచి వైదొలిగిందన్నారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు ప్రయత్నాలు చేసినందుకుగాను అమెరికా, భారత్ చైనా, బ్రెజిల్, ఇతర మధ్యప్రాచ్య, ఆఫ్రికన్ దేశాలకు ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. కాగా ప్రత్యక్ష చర్చలు ఇరు దేశాల్లో శాశ్వత శాంతి నెలకొల్పేలా ఉండాలన్నారు. ఈ నెల 15న ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల చర్చలకు పుతిన్ ప్రతిపాదించారు. మరోవైపు రష్యా - ఉక్రెయిన్ శాంతి చర్చలకు వేదిక కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని టర్కీ అధ్యక్షులు ఎర్డోగాన్ కార్యాలయం ప్రకటించింది. కాగా.. రష్యా అధినేత పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ ప్రకటించారు. ఇస్తాంబుల్ వేదికగా చర్చలకు పుతిన్ ఆహ్వానాన్ని నేరుగా ఆయన ప్రస్తావించలేదు. కానీ, "ఎట్టకేలకు రష్యా యుద్ధం ముగించే విషయాన్ని పరిశీలిస్తోంది" అని పేర్కొన్నారు. చాలా రోజుల నుంచి ఇందుకోసమే ప్రపంచం మొత్తం ఎదురు చూస్తోందన్నారు. యుద్ధం ముగింపులో మొదటి అడుగు కాల్పుల విరమణే అని పేర్కొన్నారు. ఈ మారణకాండను ఒక్కరోజు కూడా కొనసాగించడంలో అర్థం లేదు. రష్యా కాల్పుల విరమణ ధ్రువీకరణ కోసం ఎదురు చూస్తున్నాం. రష్యా ప్రతినిధులను కలిసేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు.

# సమాచార యుద్ధం !

- సోషల్ మీడియాలో కల్పిత కథనాలు, వార్తలు, ప్రచారాలు
- 'ఆర్ట్ ఆఫ్ వార్' అంటూ సమర్థనలు
- ఉద్రిక్తతల నడుమ ప్రజల్లో గందరగోళం
- 'ఫేక్' కట్టడికి పని చేసిన ఫ్యాక్ట్-చెకింగ్ సంస్థలు



**న్యూఢిల్లీ :** భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల నడుమ సామాజిక మాధ్యమాల్లోనూ పలు పోస్టులు వరదలై పారాయి. ఇందులో కొన్ని వాస్తవాలైతే, మరికొన్ని కల్పిత కథనాలు ఉన్నాయి. ముఖ్యంగా, ఫేక్ న్యూస్, కథనాలు, ప్రచారాలు తీవ్రంగా వైరలయ్యాయి. దీంతో దేశంలోని సాధారణ ప్రజలలో తప్పుడు సమాచారంతో గందరగోళం ఏర్పడింది. దేనిని నమ్మాలో, దేనిని నమ్మకూడదో తెలియని పరిస్థితి వారిలో ఏర్పడింది. ముఖ్యంగా, బీజేపీ అనుకూల సోషల్ మీడియానైతే ఈ విషయంలో ముందున్నది. ఆ వర్గం అనుకూల ప్రధాన స్రవంతి మీడియా సైతం ఇదే తీరులో పని చేసింది. పైగా.. ఫేక్ న్యూస్ పోస్టింగ్‌లను 'సమాచార యుద్ధం'గా పరిగణించటం గమనార్హం.

**ఫ్యాక్ట్-చెకింగ్ సంస్థలపై భారం**

సోషల్ మీడియాలో వెల్లువలా వచ్చిన ఈ తప్పుడు సమాచారంపై ఫ్యాక్ట్-చెకింగ్ సంస్థలు అయిన ఆల్ట్ న్యూస్, బూమ్ లైవ్, ప్రభుత్వ సంబంధిత ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలు నిరంతరం పని చేశాయి. నకిలీ కథనాల విషయంలో ప్రజలను అప్రమత్తంగా ఉంచేలా కృషి చేశాయి. వాస్తవానికి, సమాచార యుద్ధం అనేది చాలా కాలంగా యుద్ధం సంభాషణలలో ఒక భాగంగా ఉంటుంది. ఇది కొందరి ఆలోచనలు, మానసిక అంశాలను ప్రభావితం చేసేలా కొందరు ఆడియెన్స్ లక్ష్యంగా జరుగుతుందని నిపుణులు చెప్పారు. ప్రధానంగా, యుద్ధం సమయంలో ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటూ ఇలాంటి లక్ష్యిత ప్రచారాలు జరుగుతాయి. అయితే, ఈరోజు సోషల్‌మీడియాలో చూస్తున్నది మాత్రం అలా జరగలేదని సైబర్‌సెక్యూరిటీ విశ్లేషకులు నందకిషోర్ హరికుమార్ చెప్తున్నారు. దీనిని తప్పుడు సమాచారం, ఒక రకమైన ప్రచారంగా ఆయన తెలిపారు. "సమాచార యుద్ధం ముఖ్యం. ఇది ఆధునిక యుద్ధంలో భాగం. కానీ, అలా జరగటం లేదు. దీనికి సమన్వయ ప్రయత్నాలుండాలి" అని నిపుణులు చెప్తున్నారు.

**ఇన్‌ఫ్లూయెన్సర్ల అతి**

నిజానిజాలతో సంబంధం లేకుండా ఏదైనా ఒక పోస్ట్ పాకిస్తాన్‌కు వ్యతిరేంగా ఉంటే చాలు.. దానిని లైక్‌లు, షేర్‌లతో వైరలయ్యేలా చేసిన సందర్భాలున్నాయి. ముఖ్యంగా, ఎక్కువ మంది ఫాలోవర్లు, రీచ్‌ను కలిగి ఉన్న కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యుయెన్సర్లు ఇదే పని చేయటం కనిపించింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో 7.20 లక్షల మందికి పైగా ఫాలోవర్లను కలిగి ఉన్న సహిబా బాలి.. దీనిని 'ఆర్ట్ ఆఫ్ వార్' పేర్కొనటం గమనార్హం.

**ఇలాంటి ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం**

సోషల్ మీడియాతో పాటు పలు ప్రధాన స్రవంతి మీడియా ఛానెళ్లలోనూ ఇదే తీరు కనిపించింది. ప్రతీ న్యూస్ ఛానెల్, డిజిటల్ ప్లాట్‌ఫామ్ అనేది భిన్నమైన సమాచారాన్ని ఇస్తున్నదని ప్రజల నుంచి ఫిర్యాదులూ అందాయనీ, అయితే, ఇదంతా యుద్ధం జరుగుతున్న సమయంలో పాటించే ఒక వ్యూహమని సదరు ఇన్‌ఫ్ల్యూయెన్సర్ చెప్పటం గమనార్హం. "సమాచార యుద్ధంతో ఏమస్తుందో నాకు తెలియకపోవచ్చు. కరాచీని నాశనం చేశారని ఒకపక్క మన సోషల్ మీడియాలో చెప్పారు. కానీ అక్కడి ప్రజలు ప్రశాంతంగా నిద్ర పోయారు. ఇలాంటి సమాచారాన్ని యుద్ధం చేయటమనరు. తెలివి తక్కువతనం అంటారు" అని ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకులు ప్రతీక్ సిన్హా అన్నారు. "అపనమ్మకమైన టీవీ మీడియా పెరిగిపోతున్నది. ప్రజలు టీవీ ఆన్ చేస్తే.. వారు ఏం చూడాలి. కొత్తగా న్యూస్ ఛానెళ్ల చూసేవారైతే.. టీవీలలో ఏది వస్తే అదే చూస్తారు. ఇక జాతీయవాదానికి సంబంధించి తప్పుడు సమాచారం వస్తే.. ఇది ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. సున్నితమైన అంశం పట్ల ఇలాంటి ప్రచారాలు గందరగోళానికి దారి తీస్తాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ హ్యాండిళ్లు, వర్గాలపై ఆధారపడటం మంచిది" అని వివరించారు.

**భారత ప్రభుత్వం ఆదేశించినా...**

సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి తప్పుడు ప్రచారాల నేపథ్యంలో ఇప్పటికే సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తూ సందేశాలు పంపింది. కానీ, అది క్షేత్రస్థాయిలో యూజర్లు, ప్రజలకు మాత్రం అందలేదని విశ్లేషకులు చెప్తున్నారు. రక్షణ, భద్రతా సంబంధమైన వార్తలను రిపోర్ట్ చేసే సమయంలో అమలులో ఉన్న నియమ, నిబంధనలకు అనుగుణంగా బాధ్యతతో వ్యవహరించాలంటూ కూడా భారత ప్రభుత్వం అన్ని మీడియా సంస్థలను ఆదేశించింది. టీవీ మీడియా సమాచారాన్ని వెరిఫై చేయకుండా వార్తలుగా ప్రసారం చేయటం సమాచార యుద్ధంలో భాగం కాదని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సంజీవ్ కనల్ అన్నారు.

# వేసవి విడిది

## కుందేలు - ఉడత

ఒక దట్టమైన అడవిలో ఒక ఉడత, కుందేలు కలిసిమెలిసి ఉండేవి. అవి ఎప్పుడూ సహాయం చేసుకుంటూ జీవించేవి. అదే అడవిలో ఒక గుంట నక్క ఉంది. కుందేలు, ఉడత స్నేహాన్ని విడగొట్టి కుందేలును ఒంటరిని చేసి, దానిని చంపుకు తినాలని అది దురాశ పడింది. అడవికి రాజైన సింహం దగ్గరికి వచ్చి కుందేలుపై లేనిపోని చాడీలు చెప్పింది.

నక్క మాటలు నమ్మిన సింహం వచ్చే సమావేశంలో కుందేలును అడుగుతానని తెలిపింది. ఈ విషయాన్నంతా చాటుగా విన్న ఉడత నక్క దుర్బుద్ధిని కుందేలుకు చెప్పింది. సమావేశం రోజు సింహం, కుందేలుని గట్టిగా అరిచింది. 'నక్క మాటలని బట్టి నువ్వు చాలా గర్వంగా ఉంటున్నావట. ఈ అడవికి నేనే రాజుని అంటున్నావట నిజమేనా!' అన్నది. 'రాజా మీకు ఎవరో నాపై లేనిపోని మాటలు చెప్పారు. ఒక్క వారం రోజులు సమయమిస్తే ఈ విషయం ఋజువు చేస్తాన'ని సింహంతో చెప్పింది.

సింహానికి మాటిచ్చిన కుందేలు, ఈ గండం నుండి ఎలా బయట పడాలో తెలియక అయోమయానికి గురయ్యింది. అప్పుడు ఉడుత కుందేలుకు ఒక ఉపాయం చెప్పింది. వారం గడిచేసరికి సింహం మళ్లీ సమావేశం పెట్టింది. నక్క, కుందేలు ఉడత ఇతర జంతువులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యాయి. 'నీ తప్పు లేదని ఋజువు చేసుకుంటానన్నావు. విషయం ఏంటని?' కుందేలుని సింహం అడిగింది. 'రాజా నేను రెండు రోజుల క్రితమే బంధువుల ఇంటికి పక్క అడవికి వెళ్లాను. అక్కడి జంతువులు 'మీ రాజు మహా చెడ్డవాడు జంతువులను ఇబ్బంది పెడతాడు, భయపడతాడని అంటున్నారు' అని అంది. కుందేలు మాటలు విన్న సింహం ఆగ్రహంతో ఊగిపోయింది. 'ఎవరో చెప్పిన మాటలు నువ్వు ఎలా నమ్మావ'ని కుందేలును నిలదీసింది. వెంటనే స్పందించిన కుందేలు, 'మరి నాపై ఎవరో ఒకరు మీకు చాడీలు చెప్పగానే మీరు కూడా నమ్మారు, న్యాయం ఇరువురికీ ఒకే రకంగా ఉండాలి కదా' అని అంది. అప్పుడు సింహం కుందేలుపై నక్క చెప్పిన ఫిర్యాదు తప్పని తెలుసుకుంది. నక్కని అడవి నుండి తరిమేసింది.

**- కామని శ్రావ్య,**
**8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,**
**పోతారెడ్డిపేట, సిద్ధిపేట.**

## చింతచెట్టు సహాయం

సోనాపూర్‌లో రాజేష్, అతని తల్లి ఉన్నారు. తల్లి పనికి వెళ్లి సంపాదించిన డబ్బులతోనే వాళ్ళ ఇల్లు గడిచేది. రాజేష్ మాత్రం ఏ పనికీ వెళ్లేవాడు కాదు. ఇంటి దగ్గర ఉన్న చింతచెట్టు కింద కూర్చొని ఏదో ఒకటి ఆలోచించేవాడు.

రాజేష్‌కు వ్యవసాయం చేయాలనే కోరిక ఉండేది. కానీ వారికి పొలం లేదు. ఒకసారి రాజేష్ తల్లి అనారోగ్యం పాలయ్యింది. ఇల్లు గడవదు. దాంతో రాజేష్ ఏదైనా ఒక పని చేయాలనుకున్నాడు. కానీ ఏ పనీ దొరకదు. మళ్లీ చింత చెట్టు కింద వచ్చి కూర్చున్నాడు. అప్పుడు అకస్మాత్తుగా రాజేష్‌కి ఏవో మాటలు వినిపిస్తాయి. చింత చెట్టు నుండే ఆ మాటలు వినిపిస్తాయి. 'రాజేష్, నీవు ఎందుకు బాధపడుతున్నావు' అని చింత చెట్టు అడిగింది. 'నాకు ఏ పనీ దొరకట్లేదు. మాకు తినడానికి తిండి కూడా దొరకడం లేదు' అని రాజేష్ చెప్పాడు.

'రాజేష్ ఏం భయపడకు. నువ్వు, మీ అమ్మ నాకు రోజూ నీళ్లు పోసి ఇంత పెద్ద చేశారు. మీరు కష్టాల్లో ఉన్నపుడు చూస్తూ ఊరుకుంటానా. నువ్వు ప్రతి రోజూ నా కాయలు తెంపుకొని వెళ్లి మార్కెట్‌లో అమ్ము' అంది. రాజేష్ అలాగే చేసి, డబ్బు సంపాదిస్తాడు. కొన్ని రోజులకు చింతకాయలు అయిపోతాయి.

మళ్ళీ రాజేష్ చింత చెట్టు కింద కూర్చొని బాధ పడ్డాడు. ఈసారి 'నా నుండి వచ్చే కర్రను తీసుకొని వెళ్లి అమ్ము' అంటుంది చింత చెట్టు. రాజేష్ చింత చెట్టు మొండెం మాత్రమే ఉంచి మిగతా కొమ్మలను కొట్టి ఆ కట్టెలను అమ్మాడు. అయినా ఆ చెట్టు ఏమీ బాధ పడదు. పైగా రాజేష్ వాళ్లకు సహాయం చేస్తున్నందుకు ఎంతో సంతోష పడింది. అలా వచ్చిన డబ్బులతో రాజేశ్ తన అమ్మను ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. ఆమె ఆరోగ్యం బాగు అవుతుంది. రాజేష్ వాళ్ళు ఆస్పత్రి నుండి తిరిగి వచ్చేసరికి ఆ చింత చెట్టు మొండెం పూర్తిగా ఎండి పోయింది. రోజూ నీళ్లు పోసి సహాయం చేసినందుకే చింత చెట్టు తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా తమ కోసం చనిపోయిందని వాళ్లు ఎంతో బాధపడతారు. అప్పటి నుండి అమ్మతో పాటు రాజేష్ కూడా పనికి వెళ్లి డబ్బులు సంపాదించాడు. అలా వచ్చిన డబ్బులతో వాళ్లు చుట్టుపక్కల, రోడ్ల వెంట అనేక మొక్కలను నాటి వాటిని కాపాడారు.

**- వేల్పుల శ్రీలత,**
**ఇంటర్ ఫస్ట్ ఇయర్, బొట్ల వనపర్తి, పెద్దపల్లి జిల్లా.**

## బొమ్మల కొలువు



**బెందాళం.యశస్విని,**
**6వ తరగతి,**
**ఎస్‌బిఎల్‌వి ఆర్ష విజ్ఞాన భారతి,**
**ముత్యాల పేట, కవిటి మండలం,**
**శ్రీకాకుళం జిల్లా.**

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com వాట్సాప్ : 83329 25496

# జీవన the family

JEEVANA

**జీవన సౌరభం**

ఓడిపోయిన ప్రతిసారీ గుర్తుంచుకోవాల్సింది.. గెలుపు ఎంతో దూరంలో లేదని..

## వడదెబ్బ తగలకుండా ...

**ఎండలు పెరిగిన క్రమంలో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఎండ బాగా తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ బలహీనపడి వడదెబ్బకు గురవుతారు. చెమట పోయదు. అప్పుడు ద్రవ పదార్థాలు ఎక్కువగా తాగుతూ శరీరాన్ని సమతులంగా ఉంచుకోవాలి. బయట పనులకు వెళ్లేవారికే కాదు, ఇంట్లో ఉన్నవారికి కూడా వడదెబ్బ తగులుతుంది. ఈ పరిస్థితి వచ్చే వరకూ ఉండకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ తగలకుండా జాగ్రత్తపడొచ్చు.**



- ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటికి వెళ్లకూడదు. పగటిపూట 11 గంటల నుంచి 3 గంటల వరకు ఇంట్లోనే ఉండాలి. ఎండలో బయటకు వెళ్లవలసి వస్తే కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. బయలుదేరే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ లేదా లస్సీని తీసుకోవాలి. – తల, చెవులను పూర్తి తెల్లని మెత్తని క్లాత్‌తో కప్పుకోవాలి. లేదా గొడుగు తప్పనిసరిగా వేసుకోవాలి.
- ఒక వాటర్ బాటిల్ తప్పనిసరిగా పెట్టుకోండి. ఈ నీళ్లలో కాస్త సాల్ట్, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే మంచిది. ఏసీ నుంచి డైరెక్ట్‌గా ఎండలోకి వెళ్లవద్దు. అలాగే ఎండలో తిరిగివచ్చి డైరెక్ట్‌గా ఏసీ గదికి వెళ్లకూడదు. కొంచెం సమయం తీసుకున్న తర్వాత వెళ్లాలి. తద్వారా శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.
- వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదు. విశ్రాంతి తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీరాన్ని ఐస్ లేదా నీటితో తుడవాలి. వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లాలి. రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి.
- సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. అందులో త్వరగా జీర్ణం అయ్యే ఆకుకూరలు, పప్పు కూరలు ఉండాలి. నీరు శాతం అధికంగా ఉండే సొరకాయ, దోసకాయ, పొట్లకాయ వంటి కూరగాయలు తీసుకోవాలి. నూనె బాగా తగ్గించాలి.
- వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. దాహంగా ఉన్నప్పుడు కూల్‌డ్రింగ్స్ తాగకూడదు. వాటికి బదులు కొబ్బరి బోండాం, మజ్జిగ తాగాలి. వడదెబ్బ వల్ల కళ్లు పొడిబారే అవకాశం ఉంది. కాబట్టి బయటకు వెళ్లేప్పుడు తప్పకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి.
- ఓఆర్ఎస్, గ్లూకోజ్ నీళ్లు కొంచెం కొంచెంగా తీసుకోవాలి. కీరదోస, పుచ్చకాయ ముక్కల్ని ఎక్కువగా తినాలి. దీనివల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. మలబద్దక సమస్య కూడా తగ్గుతుంది. ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

## తాటి ముంజెల్లో మేటి పోషకాలు

**ఎటువంటి రసాయనాలు లేకుండా సహజసిద్ధంగా తియ్యని రుచిని ఇచ్చే తాటిముంజెల్లో ఆరోగ్యపోషకాలు ఎక్కువగా ఉంటాయి.**

- తాటి ముంజెల్లో విటమిన్ బి–7, విటమిన్–కె, కరిగే ఫైబర్, పొటాషియం, కాల్షియం, విటమిన్–ఎ, విటమిన్–సి, విటమిన్–డి, జింక్, ఐరన్, పోషకాలు ఉంటాయి.
- నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా వుంటుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి.
- వీటిలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది.
- రక్తపోటు, గుండె ఆరోగ్యాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. – శరీరంలోని హానికరమైన వ్యర్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి.
- వేసవిలో క్రమం తప్పకుండా తీసుకుంటే కాలేయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి.
- తాటి ముంజలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పోతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది.
- వీటిలోని పోషకాలు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి.
- వేసవిలో ఎండ వల్ల వచ్చే వికారం, వాంతులు రాకుండా ఉంటాయి.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అవకాశాలను బాగా తగ్గిస్తాయి.
- వేసవిలో వచ్చే చికున్ గున్యాను నివారిస్తాయి.
- శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
- శరీరంలోని అధిక బరువును తగ్గించడంలో ఎంతగానో సహకరిస్తాయి.

## మెడ నల్లగా మారుతుందా?



**వేసవిలో బయట పనులు చేసేవారి మెడ నల్లగా మారిపోతుంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా మెడను సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల, శరీరంలో ఐరన్ తగ్గడం వల్ల మెడ నల్లగా మారుతుంది. స్థూలకాయం పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్, జన్యుపరమైన కారణాలు, పీసీఓడీ సమస్య, పెర్ఫ్యూమ్ ఎక్కువగా వాడడం వల్ల అలర్జీలు, డయాబెటిస్, హైపో థైరాయిడిజం వల్ల కూడా మెడ నల్లబడుతూ ఉంటుంది. వేసవిలో వచ్చే ఈ సమస్యను ఇలా నివారించుకోవచ్చు.**

- వేసవిలో మెడ నలుపును పోగొట్టుకోవాలంటే మెడపై స్కార్ఫ్‌తో కప్పుకోవాలి.
- ఒక గిన్నెలో టూత్‌పేస్ట్ తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని మెడలోని నల్లటి భాగంలో బాగా రాయాలి. 10 నిమిషాల పాటు అప్లై చేసుకుని, ఆపై శుభ్రమైన నీటితో మెడను కడగాలి. వారానికి రెండు సార్లు ఇలా అప్లై చేయడం వల్ల మెడ ముదురు రంగు పోతుంది.
- ఒక చెంచా శనగపిండిని తీసుకుని, దానికి చిటికెడు పసుపు వేసి, ఒక చెంచా పెరుగు వేసి బాగా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను మెడపై అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. 20 నిమిషాల తర్వాత, టవల్ లేదా మెత్తటి వస్త్రంతో మెడను శుభ్రంగా తుడవాలి. ఈ పేస్ట్‌ని వారానికి రెండు సార్లు అప్లై చేయడం వల్ల చర్మం రంగు మెరుగవుతుంది.
- యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో కూడిన కలబంద జెల్‌ను మెడకు పట్టించి కొంతసేపు మసాజ్ చేయాలి. ఈ జెల్‌ను రాత్రి పూట రాసుకుంటే మంచిది. రాత్రంతా మెడపై జెల్ వదిలి ఉదయం కడగాలి.

## విశ్వక్‌సేన్ దర్శకత్వంలో 'కల్ట్'



విశ్వక్‌సేన్, అల్లుఅరవింద్

దర్శకుడు, నిర్మాత, రచయితగా విశ్వక్‌సేన్ తన ప్రతిభను చాటారు. ఇప్పుడు ఆయన నెక్స్ట్ ప్రాజెక్ట్ 'కల్ట్' కోసం సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను తారక్ సినిమాస్, వన్మయే క్రియేషన్స్ బ్యానర్లపై కరాటే రాజు, సందీప్ కాకర్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి విశ్వక్‌సేన్ దర్శకుడిగానే కాదు, కథ కూడా స్వయంగా రాసుకున్నారు.

న్యూ ఏజ్ పార్టీ థ్రిల్లర్‌గా, వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం రామానాయుడు స్టూడియోలో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఈ కార్యక్రమానికి కోర్ టీమ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఎస్.రాధాకృష్ణ (చిన్నబాబు) టైటిల్ లోగోను లాంచ్ చేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ముహూర్తపు షాట్‌కు కెమెరా స్విచ్ ఆన్ చేశారు, అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. ప్రారంభోత్సవంతో పాటు రెగ్యులర్ చిత్రీకరణ కూడా నేడు ప్రారంభమైంది.

ఈ సినిమాలో విశ్వక్‌సేన్‌తోపాటు 40 మంది కొత్త నటీనటులను పరిచయం చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెలుగు, హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో ఈ సినిమా విడుదల కాబోతోంది. ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో విశ్వక్‌సేన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రచన, నిర్మాత, దర్శకత్వం: విశ్వక్‌సేన్, నిర్మాతలు: కరాటే రాజు, సందీప్ కాకర్ల, సంగీతం: రవి బస్రూర్, డీఓపీ: అర్విందో విష్వనాథన్, ఎడిటర్: రవి తేజ గిరిజాల, ఆర్ట్ డైరెక్టర్: అర్విందో ములే, కొరియోగ్రాఫర్: వశ్వంత్ మాస్టర్, యాక్షన్ డైరెక్టర్: కరుణక్ ఏఆర్, కాస్ట్యూమ్ డిజైనర్: అన్నపూర్ణ.

నవీన్ చంద్ర, సందీప్ కిషన్

## పవర్‌ఫుల్ కథతో 'ఎలెవెన్'

నవీన్ చంద్ర హీరోగా నటించిన బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవెన్'. సుందర్ సి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రుచిర ఎంటర్టైన్మెంట్స్ అధినేత, డిస్ట్రిబ్యూటర్ ఎన్.సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈనెల 16న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. సందీప్ కిషన్ చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ,'ఇప్పటివరకు సినిమా చూసిన వాళ్ళందరూ కూడా చాలా బాగుందని చెప్పారు. వాళ్ల రియాక్షన్స్ చూసినప్పుడు నాకు మరింత కాన్ఫిడెన్స్ వచ్చింది. ఈనెల 15న ఈ సినిమా పెయిడ్ ప్రీమియర్స్‌ని ప్లాన్ చేశాం. పెయిడ్ ప్రీమియర్స్ నుంచి చూసి ఆడియన్స్ బయటకు వచ్చినప్పుడు నేను అక్కడే నిల్చుని ఉంటాను ఒకవేళ మీకు సినిమా నచ్చకపోయి ఉంటే మీ టికెట్ ని వెనక్కి అడిగే హక్కు మీకు ఉంది. ఒకవేళ సమయం వృధా అయిందని అనిపించినా ప్రశ్నించే హక్కు కూడా మీకు ఉంటుంది. నేను చేసే కథలు, పాత్రలు బావుంటాయని ప్రేక్షకులు మొదట నుంచి ప్రశంసిస్తున్నారు. ఆ గౌరవానికి రిటర్న్‌గా ఈ సినిమా ఉంటుందని నమ్ముతున్నాను. ఈ సినిమాని నిర్మాతలు ఎంతో ఫ్యాషన్‌తో తీశారు. ఆడియన్స్‌కి గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. నా కథే నా బలం. ఖచ్చితంగా ఈ సినిమా మీకు నచ్చుతుంది. ఈ సినిమాలో ఉన్న యూనిక్ కాన్సెప్ట్‌ని ఇప్పటివరకు మీరు ఏ థ్రిల్లర్‌లో కూడా చూసి ఉండరు. ఒక 30 మినిట్స్ చాలా ఎమోషన్‌కి గురి అవుతారు. ఆ ఎమోషన్ ఆడియన్స్‌కి ఓ మంచి అనుభూతినిస్తుంది. మా ట్రైలర్‌ని లాంచ్ చేసిన కమల్ హాసన్‌కి ధన్యవాదాలు. ఆయన లాంచ్ చేయడంతో ట్రైలర్ చాలా అద్భుతమైన రీచ్‌తో వెళ్ళింది' అని తెలిపారు.

## 'షష్టిపూర్తి' విడుదలకు సిద్ధం




తండ్రి ఇళయరాజా స్వర సారథ్యంలో కొన్ని తమిళ పాటలు పాడిన యువన్ శంకర్ రాజా తొలిసారిగా 'షష్టి పూర్తి' సినిమా కోసం డైరెక్ట్‌గా తెలుగులో పాట పాడారు.

ఆ క్రెడిట్, ఆ లక్ తమకు దక్కడం పట్ల చాలా ఆనందం వెలి బుచ్చారు నిర్మాత రూపేష్, దర్శకుడు పవన్ ప్రభ. రాజేంద్రప్రసాద్, అర్చన ముఖ్య తారలుగా, రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో, హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకం పై రూపేష్ నిర్మించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని మూడో పాట 'రాత్రంతా రచ్చే, మరి నువ్వంటే పిచ్చే, నీ మాటే నచ్చే ..'ను విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ రచించిన ఈ పాటను యువన్ శంకర్ రాజా, నిత్య శ్రీ ఆలపించారు. జంగ్లీ మ్యూజిక్ సంస్థ ఈ పాటను ఆన్ లైన్‌లో రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ, 'మా నాన్న సంగీత దర్శకత్వంలో ఈ తెలుగు పాట పాడినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా కూల్ సాంగ్. మీ అందరికీ నచ్చుతుందనే అనుకుంటున్నాను' అని చెప్పారు.

# అదరగొట్టిన అమ్మాయిలు

**మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ భారత్ కైవసం**
**శతకంతో రాణించిన స్మృతి మంధాన**

కొలంబో: దక్షిణాఫ్రికా, శ్రీలంక, భారత్ మధ్య జరిగిన మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో విజేతగా టీమిండియా నిలిచింది. సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంకపై భారత్ 97 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 343 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక 48.2 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. లంక బ్యాటర్లలో చమరి ఆటపట్టు (51) అర్ధశతకం సాధించింది. నీలాక్షి(48), విష్మి(36) రాణించారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోర్‌కే ఔటయ్యారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, అమన్‌జ్యోత్ 3 వికెట్లు తీశారు. శ్రీచరణి ఒక వికెట్ పడగొట్టింది.

**స్మృతి సెంచరీ.. భారత్ భారీ స్కోర్**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా బ్యాటర్లందరూ రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (116; 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకంతో

స్మృతి మంధాన(116)

ఆకట్టుకుంది. హర్లీన్ డియోల్ (47బీ 56 బంతుల్లో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (41బీ 30 బంతుల్లో), జెమీమా రోడ్రిగ్స్ (44బీ 29 బంతుల్లో), ప్రతీకా రావల్ (30) రాణించారు. అమన్‌జ్యోత్ కౌర్ (18), రిచా ఘోష్ (8), దీప్తి శర్మ (20బి) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో దేవ్మీ విహంగా 2, సుగందికా కుమారి 2, మదార 2, ఇనోకా రణవీర ఒక వికెట్ పడగొట్టారు.

తొలుత మంధాన, ప్రతీకా టీమిండియాకు శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించింది. నిలకడగా ఆడుతున్న ప్రతీకాను ఇనోకా రణవీర వెనక్కి పంపింది. అనంతరం హర్లీన్ డియోల్‌తో జతకట్టిన మంధాన. 55 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకుంది. నిలకడగా బౌండరీలు బాది సెంచరీకి చేరువైన మంధాన.. చమీర ఆటపట్టు వేసిన 31 ఓవర్‌లో వరుసగా నాలుగు ఫోర్లు రాబట్టింది. ఈ క్రమంలోనే వన్డేల్లో 11వ సెంచరీ (92 బంతుల్లో) పూర్తి చేసుకుంది. జోరుమీదున్న స్మృతిని దేవ్మీ విహంగా పెవిలియన్‌కు పంపింది. కాసేపటికే హర్లీన్ కూడా ఔటైంది. దేవ్మీ బౌలింగ్‌లో ఆమెకే రిటర్న్ క్యాచ్ ఇచ్చింది. దూకుడుగా ఆడిన హర్మన్‌ప్రీత్.. సుగందికా కుమారి బౌలింగ్‌లో మదారకు చిక్కింది. తర్వాత వచ్చిన రిచా ఘోష్‌ను మందార వెనక్కి పంపింది. అర్ధ శతకానికి చేరువైన జెమీమా సుగందికా బౌలింగ్‌లో ఔటైంది. చివరి నాలుగు ఓవర్లలో భారత్ ఒక వికెట్ నష్టపోయి 37 పరుగులు రాబట్టింది..

# ప్రభుత్వ అనుమతే తరువాయి!

**ముంబయి** : ఐపిఎల్ 2025 సీజన్ పున ప్రారంభం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అనుమతిపై ఆధారపడింది. భారత్, పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపిఎల్ 18ను ఓ వారం పాటు వాయిదా వేస్తూ బిసిసిఐ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ అమల్లోకి రావటంతో ఐపిఎల్ 18వ సీజన్‌లో మిగిలిన 16 మ్యాచులను ముగించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఫ్రాంఛైజీలు, ప్రసారదారులు సహా రాష్ట్ర క్రికెట్ సంఘాలతో మాట్లాడుతున్న బిసిసిఐ వర్గాలు.. ఐపిఎల్18 పున ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది. రానున్న 48 గంటల్లో అందరిని సంప్రదించి రీ షెడ్యూల్ వెల్లడించేందుకు బిసిసిఐ రోడ్‌మ్యాప్ సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఐపిఎల్18ను మే 9న వాయిదా వేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లో లీగ్ పున ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. వాయిదా పడిన మరుసటి రోజే కాల్పుల విరమణ అంగీకారం కుదిరింది. దీంతో లీగ్ ప్రారంభంపై ఆటగాళ్లు, అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. రీ స్టార్ట్‌పై నిర్ణయం తీసుకోవడానికి బోర్డుకు మరింత సమయం ఉందని, అందరితో సంప్రదింపులు జరిపిన అనంతరం రీ షెడ్యూల్ ప్రకటిస్తామని బిసిసిఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా తెలిపారు. 'ఐపిఎల్‌ను ఏడు రోజుల పాటు వాయిదా వేస్తూ బిసిసిఐ నిర్ణయం తీసుకుంది. రీ షెడ్యూల్, పున ప్రారంభంపై నిర్ణయానికి బోర్డుకు తగిన సమయం ఉంది. ప్రస్తుత పరిస్థితులను బీసీసీఐ నిశితంగా పరిశీలిస్తోంది. ఐపిఎల్ భాగస్వాములు సహా ప్రభుత్వ విభాగాలతో మాట్లాడుతున్నాం. ఆ తర్వాతే రీ స్టార్ట్‌పై నిర్ణయం ఉంటుంది' అని దేవాజిత్ సైకియా అన్నారు. మరో 48 గంటల్లో ఫ్రాంఛైజీలు, ప్రసారదారులు, స్పాన్సర్లు, ఐపీఎల్ మ్యాచులకు ఆతిథ్యం ఇస్తున్న రాష్ట్ర క్రికెట్ సంఘాలతో మాట్లాడుతాం. ఐపిఎల్‌ను ఈ దశలో, ఈ పరిస్థితుల్లో పున ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం. ఈ ప్రక్రియ ముగిశాక ఐపిఎల్18 రీ స్టార్ట్‌పై బిసిసిఐ ప్రకటన చేస్తుందని దేవాజిత్ తెలిపారు. ఐపిఎల్18లో గ్రూప్ దశలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ నడుమ అర్థాంతరంగా రద్దుగా ముగిసిన పోరుతో సహా 58 మ్యాచులు ముగిశాయి. గ్రూప్ దశలో మరో 12 మ్యాచులు, ప్లే ఆఫ్స్‌లో నాలుగు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఒరిజినల్ షెడ్యూల్ ప్రకారం మే 25న ఫైనల్‌తో ఐపిఎల్ ముగియాలి. కానీ ఇప్పుడు 7–10 పది రోజుల విరామం రావటంతో ఫైనల్ మే ఆఖరు లేదా జూన్ తొలి వారానికి జరిగే అవకాశం ఉంది. జూన్ 11 నుంచి ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పోటీపడనుండగా.. ఈ నెలాఖరులోనే లీగ్‌ను ముగించాలని బోర్డు భావిస్తోంది. అందుకోసం మూడు నగరాల్లోనే, అవసరమైతే వీలైనన్ని డబుల్ హెడర్ మ్యాచులను షెడ్యూల్ చేయాలని యోచిస్తోంది. ప్లే ఆఫ్స్ మ్యాచులకు హైదరాబాద్, కోల్‌కతలను ఆతిథ్య నగరాలుగా కొనసాగిస్తూ.. గ్రూప్ దశ మ్యాచులను హైదరాబాద్, బెంగళూర్, చెన్నైలో నిర్వహించేందుకు ప్లాన్–బి సిద్ధం చేసింది. లీగ్ పున ప్రారంభమైన తర్వాత 12–14 రోజుల్లోనే ఫైనల్‌ను షెడ్యూల్ చేసేందుకు బీసీసీఐ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68